ఆదివారం 11 అక్టోబరు 2026

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## ప్రకృతి సేద్యంలో దేశానికే ఏపీ ఆదర్శం

- రసాయన ఎరువుల వాడకం తగ్గింది
- రైతులకు ఆదాయం పెరిగింది
- ఏపీ నాచురల్ ఫార్మింగ్ విధానాలకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు
- టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

- వివరాలు 4లో..

# 100% స్థానాల్లో విజయం సాధించాలి

- అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇన్‌చార్జి మంత్రులదే
- నవంబరు 15 నాటికి స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశం



ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల సమరానికి కూటమి ప్రభుత్వం సమర శంఖం పూరించింది. కేబినెట్ భేటీ ముగిసిన వెంటనే సహచర మంత్రులతో నిర్వహించిన సమావేశంలో సీఎం నారా చంద్రబాబునాయుడు ఎన్నికల రోడ్‌మ్యాప్‌ను ఖరారు చేశారు. నవంబరు 15 నాటికి ప్రక్రియను పూర్తి చేసి రెగ్యులర్ పాలనలోకి వెళ్లాలని ఆదేశించారు. 100 శాతం స్థానాల్లో కూటమి పార్టీల అభ్యర్థులు విజయం సాధించి తీరాలని దిశానిర్దేశం చేశారు. అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇన్‌చార్జి మంత్రులదేనని స్పష్టం చేశారు. వారంతా మరింత చురుగ్గా ఉంటూ టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులను సమన్వయం చేసుకుని క్లీన్‌స్వీప్ సాధించేలా వ్యూహాలకు పదునుపెట్టాలని పిలుపునిచ్చారు.

2



## 'స్థానిక' పోరులో బీసీలకు రక్షణ

కూటమి సర్కారు కీలక నిర్ణయంతో అదనంగా వేల పదవులు

... వివరాలు 2లో

# బీసీ రిజర్వేషన్లు ఖరారు!

**తొమ్మిది కేటగిరీలుగా స్థానిక సంస్థల వర్గీకరణ**

**రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్ల నిర్ణయం**

**రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం**

అమరావతి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన శనివారం ఉదయం సమావేశమైన మంత్రివర్గం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసింది. గ్రామ పంచాయతీ వార్డు మెంబరు, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ, జడ్పీ చైర్‌పర్సన్, మున్సిపల్ వార్డు మెంబరు, మున్సిపల్ చైర్‌పర్సన్, మేయర్ సహా మొత్తం 9 కేటగిరీల్లో రిజర్వేషన్లను ఆమోదించారు. కేబినెట్ భేటీ ముగిసిన తర్వాత ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంత్రులు రిజర్వేషన్ల శాతాలను అధికారికంగా వెల్లడించారు. దీంతో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది.

| పదవి | శాతం (%) |
|---|---|
| పంచాయతీ వార్డు మెంబర్లు | 26.73 |
| సర్పంచ్‌లు | 27.95 |
| ఎంపీటీసీలు | 25.55 |
| ఎంపీపీలు | 24.60 |
| జడ్పీటీసీలు | 24.60 |
| జడ్పీ చైర్‌పర్సన్లు | 23.08 |
| అర్బన్ వార్డు మెంబర్లు | 32.78 |
| మున్సిపల్ చైర్‌పర్సన్లు | 32.03 |
| మేయర్లు | 35.02 |

## 271 మద్యం దుకాణాలకు రెండో విడత నోటిఫికేషన్

- 19 అర్ధరాత్రి వరకు దరఖాస్తులు
- 21న ఉదయం 8 గంటలకు లాటరీ

7

# ఈడీ స్పీడ్.. జగన్‌లో టెన్షన్..!



జగన్ అక్రమాస్తులపై తెలంగాణ హైకోర్టులో ఈడీ పిటిషన్

నాంపల్లి సీబీఐ కోర్టులో పదేళ్లుగా 9 ఛార్జిషీట్లు పెండింగ్

రోజువారీ విచారణతో కేసులు త్వరగా తేల్చాలని కోరిన ఈడీ

జగన్‌తో సహా నిందితులు వ్యక్తిగత హాజరుకు ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి





# పట్టిసీమ లిఫ్ట్‌తో ఏపీకి జల భద్రత

**కృష్ణా బేసిన్‌కు 500 టీఎంసీల గోదావరి జలాలు**

**శ్రీశైలం నుంచి రాయలసీమ దాహార్తి తీర్చిన కృష్ణమ్మ**

**ఏపీ వాటర్ మ్యాన్ అంటూ సీఎం చంద్రబాబుకు డెల్టా రైతుల ప్రశంసలు**

11 ఏళ్లలో 500 టీఎంసీల నీటిని సమర్థవంతంగా వినియోగించుకుని రాష్ట్రానికి 'జల భద్రత' కల్పించారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి కృష్ణా డెల్టా రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు నీరాజనం పట్టారు. శనివారం వారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడితో కలిసి సచివాలయంలో సీఎంను ఘనంగా సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పోలవరం కంటే ముందే పట్టిసీమ లిఫ్ట్ ద్వారా గోదావరి వరద నీటిని కృష్ణా డెల్టాకు మళ్లించిన చంద్రబాబును ఏపీ వాటర్ మ్యాన్ అని ప్రశంసించారు.

3



# వేగంగా అమరావతి పనులు

- రైతుల ప్లాట్లు, రోడ్లు, భవన నిర్మాణాలపై కాంట్రాక్టు సంస్థలకు టార్గెట్లు
- 2028 అక్టోబరు నాటికి రాజధాని నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యం
- అధికారులు, ప్రజాప్రతినిధుల భవనాలు దాదాపు పూర్తి
- భూసేకరణ జరుగుతున్న గ్రామాల్లో పెండింగులో స్థానిక ఎన్నికలు
- నవంబరు 11 తర్వాత ప్రారంభోత్సవాలు: పురపాలక శాఖ మంత్రి నారాయణ

5



# 100% స్థానాల్లో విజయం సాధించాలి

**అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇన్‌చార్జి మంత్రులదే**

**నవంబరు 15 నాటికి స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాలి**

**కేబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు ఆదేశం**



అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శనివారం ఉదయం జరిగిన ఏపీ కేబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై చర్చ జరిగింది. స్థానిక ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పట్టణాల్లో బీసీల జనాభా శాతం బాగా పెరిగిందని... ఎన్టీఆర్ సమయంలో బీసీలకు 24శాతం రిజర్వేషన్లు ఇచ్చారని గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో 34 శాతం బీసీలకు ఇచ్చారని.. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు బీసీ రిజర్వేషన్లపై సరైన నిర్ణయాలు తీసుకోలేకపోయాయని విమర్శించారు.

ఎన్నికలకు కూటమి సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. నవంబరు 15వ తేదీ నాటికి స్థానిక ఎన్నికలను పూర్తి చేసి రెగ్యులర్ పరిపాలనలోకి వెళ్లాలని మంత్రులకు సూచించారు. కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇన్‌చార్జి మంత్రులదే అని స్పష్టం చేశారు. మూడు పార్టీల నేతలు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితుల ఆధారంగా ఇన్‌చార్జి మంత్రులు సమన్వయం చేసుకోవాలన్నారు. ఏ ఒక్క స్థానం లోనూ ఓడిపోవడానికి వీల్లేదని, 100 శాతం స్థానాలను గెలుచుకుని తీరాల్సిందేనన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కొత్త నాయకత్వం వస్తుందని అభిప్రాయపడ్డారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశించారు.

గతంలో 34 శాతం రిజర్వేషన్ ఉంటే దానిని కదిలించింది జగన్ అని.. ఆ తర్వాత హైకోర్టు కొట్టివేస్తే సుప్రీంకోర్టుకు కూడా వెళ్లలేదని చంద్రబాబు విమర్శించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లను బీసీలకు ఇస్తుంటే.. అది అమలు కాకుండా కోర్టుకు వెళ్లారని మండిపడ్డారు. బీసీలకు రిజర్వేషన్ రాకుండా వైసీపీ అడ్డుపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు సాధ్యమైనంత ఎక్కువ రిజర్వేషన్ ఇద్దామని, పార్టీపరంగా 34 శాతం రిజర్వేషన్ ఇద్దామని ఈ సందర్భంగా సీఎం చెప్పుకొచ్చారు. వైసీపీ కోర్టుకు వెళ్లకుండా ఉంటే 34 శాతం రిజర్వేషన్ అమలయ్యేదన్నారు. గతంలో బీసీలకు రిజర్వేషన్ ఇచ్చే విషయంలో కూడా జగన్ తప్పులు చేశారని వ్యాఖ్యానించారు. కమిషన్ వేయకుండానే జగన్ 34 శాతం రిజర్వేషన్ జీవో ఇచ్చారని.. దీంతో ఆనాడు హైకోర్టు కొట్టివేసిందన్నారు. 'సర్' తర్వాత వచ్చే ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహించాలని జగన్ కోర్టుకు వెళ్లారని తెలిపారు.

ఎల్‌నినో సమయంలో సామాన్య ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో 34 శాతం లోటు వర్షపాతం ఉన్నప్పటికీ గత ఏడాది నీటి నిల్వలు చేసుకోవడం వలన ఈ ఏడాది కొంతవరకు బయటపడ్డామని చెప్పుకొచ్చారు. మంత్రులు ప్రేక్షకుల మాదిరిగా ఉండవద్దని.. కొత్త విషయాలు



నేర్చుకోవాలన్నారు. కేంద్రంలో ఉన్న సంబంధిత శాఖ మంత్రితో టచ్‌లో ఉండాలని తెలిపారు. ఎమ్మెల్యేలకు నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులను సోమ, మంగళవారాల్లో విడుదల చేస్తామని.. ఒక్కో నియోజకవర్గానికి కోటి రూపాయల చెప్పున విడుదల చేయనున్నట్లు సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదిక వివరాలను అధికారులు చదివి వినిపించారు.

# 'స్థానిక' పోరులో బీసీలకు రక్షణ

- **రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులకు ఏపీ కేబినెట్ ఆమోదం**
- **బీసీలకు అదనంగా వేల స్థానాలు**
- **కూటమి సర్కారు కీలక నిర్ణయం**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాటుచేసిన డెడికేటెడ్ బీసీ కమిషన్ (రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్) సిఫార్సులకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీలు మినహా వివిధ కేటగిరీలకు చెందిన దాదాపు 1.40 లక్షలకు పైగా స్థానాల్లో బీసీ రిజర్వేషన్లు వర్తించే అవకాశం ఉంది.

**38వేల మందికి పైగా పదవులు:**

పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు వర్తింపజేస్తుండటంతో 38వేల మందికి పైగా బీసీలకు స్థానిక ప్రజాప్రతినిధులుగా పదవులు దక్కనున్నాయి. గత వైసీపీ హయాంలో నిర్వహించిన స్థానిక ఎన్నికల్లో సుమారు 33వేల మంది బీసీలకే అవకాశం దక్కగా, ఇప్పుడు జిల్లాల విభజన, వార్డులు, డివిజన్ల పెంపుతో మరింత మంది బీసీ నాయకులకు పదవులు లభించనున్నాయి.

**చట్టబద్ధ రిజర్వేషన్లు తగ్గినా.. పార్టీలపరంగా 34శాతం స్థానాలు:**

చట్టపరమైన నిబంధనల ప్రకారం 34శాతం కంటే తక్కువ రిజర్వేషన్లు ఉండే కేటగిరీల్లో కూడా కూటమి పార్టీల తరపున బీసీ అభ్యర్థులకే టికెట్లు కేటాయించి... మొత్తం మీద 34 శాతం స్థానాలు దక్కేలా చూస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు.

**సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటిస్తూ...**

మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటిస్తూనే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగ నిబంధనలకు లోబడి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను అమలు చేస్తూనే, బీసీలకు గరిష్ఠంగా ఎక్కువ స్థానాల్లో పోటీచేసే అవకాశం కల్పిస్తూ ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది.



# పట్టిసీమ లిఫ్ట్‌తో ఏపీకి జల భద్రత

- **కృష్ణా బేసిన్‌కు 500 టీఎంసీల గోదావరి జలాలు**
- **శ్రీశైలం నుంచి రాయలసీమ దాహార్తి తీర్చిన కృష్ణమ్మ**
- **ఏపీ వాటర్ మ్యాన్ అంటూ సీఎం చంద్రబాబుకు డెల్టా రైతుల ప్రశంసలు**

అమరావతి (చైతన్యరథం): పోలవరం ప్రాజెక్టు కంటే ముందే పట్టిసీమ లిఫ్ట్ ద్వారా గోదావరి వరద జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించి సంపద సృష్టికి కారణమైన సీఎం చంద్రబాబును డెల్టా రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు సత్కరించారు. 11 ఏళ్లలో 500 టీఎంసీల నీటిని కృష్ణా డెల్టాకు తీసుకురావడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు జల భద్రత తెచ్చారని కొనియాడారు.

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి శనివారం సచివాలయానికి వచ్చిన రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు సీఎంను సత్కరించి ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. గోదావరి వరద జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించి... ఇక్కడ పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమకు అందించడం ద్వారా రాష్ట్రంలో సాగు, తాగునీటి అవసరాలకు కొత్తదారి



చూపించారని రైతులు వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి జల ప్రదాతగా నిలిచారని, ఏపీ వాటర్‌మ్యాన్‌గా మారారని రైతులు ముఖ్యమంత్రితో అన్నారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా ఇప్పటిదాకా 500 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించి సద్వినియోగం చేశారని హర్షం వ్యక్తం చేశారు. పట్టిసీమ ప్రాజెక్టుతో తమకు కలిగిన ప్రయోజనాలను గుర్తుచేస్తూ ముఖ్యమంత్రికి రైతులు ధన్యవాదాలు తెలిపారు.

**డెల్టా రైతుల కష్టాలు తీర్చిన ఆలోచన**

పట్టిసీమ ప్రాజెక్టు ఆలోచన ఈ ప్రాంత రైతుల కష్టాలను తీర్చడమే కాకుండా సంపద సృష్టించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గోదావరి వరద నీటిని కృష్ణా డెల్టాకు తీసుకురావడం ద్వారా సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు శ్రీశైలం జలాశయంలో పొదుపు చేసిన కృష్ణా నీటిని రాయలసీమకు మళ్లించగలిగామని వివరించారు. ఒక ప్రాంతానికి నీరిస్తూనే మరో ప్రాంతానికి నీటి భద్రత కల్పించడం పట్టిసీమతో సాధ్యమైందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా అందిన నీటితో కృష్ణా డెల్టాలో రైతులు సమృద్ధిగా పంటలు పండించి రాష్ట్ర సంపదకు తోడ్పడ్డారని కొనియాడారు. పట్టిసీమ ద్వారా సాధించిన జల విజయం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని చెప్పారు. గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు తీసుకు రావడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలకు రైతులు కూడా సహకరించారని గుర్తు చేశారు. కృష్ణా బేసిన్‌లో గోదావరి జలాలను వినియోగించడం వల్ల పొదుపు చేసిన కృష్ణా నీటిని రాయలసీమలో సాగు, తాగునీటి అవసరాలకు మళ్లించగలిగామని ముఖ్యమంత్రి తెలిపారు. నీటి లభ్యతతో రాయలసీమలో కియా వంటి ప్రతిష్ఠాత్మక పరిశ్రమలకు కూడా నీరు అందించగలిగామని పేర్కొన్నారు. సాగునీటి సమస్యలకు పరిష్కారం చూపడమే కాకుండా పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన నీటి భద్రత కల్పించడంలోనూ సమగ్ర జల నిర్వహణ కీలక పాత్ర పోషించిందని సీఎం చెప్పారు.

# పితృ దేవతలకు తర్పణం

**- సంప్రదాయాలకు చంద్రబాబు గౌరవం**





అమరావతి (చైతన్యరథం): భారతీయ సంస్కృతిలో పితృ దేవతల స్మరణకు, పూర్వీకుల పట్ల కృతజ్ఞతను చాటుకోవడానికి మహాలయ అమావాస్యకు ప్రత్యేక స్థానం ఉంది. భాద్రపద బహుళ అమావాస్యను సర్వపితృ అమావాస్యగా పిలుస్తారు. ఈ పవిత్రమైన రోజున పితృ దేవతలకు తర్పణాలు సమర్పించడం, శ్రాద్ధ కర్మలు నిర్వహించడం హిందూ సంప్రదాయంలో భాగం. సీఎం చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా తన పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు. ఆధునిక పాలనలో రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూనే... మన సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ విలువలకు గౌరవం ఇవ్వడం భారతీయ జీవన విధానంలోని గొప్పతనాన్ని ప్రతిబింబిస్తుంది. మూలాలను మరచిపోకుండా పూర్వీకులను స్మరించుకుంటూ సంప్రదాయాలను భావితరాలకు అందించడమే ఈ పవిత్ర దినం ఇచ్చే సందేశం.

## అమెరికాలో మాజీ ఎమ్మెల్యే గఫూర్ కుమారుడి మృతి



కర్నూలు(చైతన్యరథం): కర్నూలు మాజీ ఎమ్మెల్యే యంఏ గఫూర్ కుమారుడు పీవీ కిరణ్ (41) అమెరికాలో మృతిచెందారు. అక్టోబరు 1న గుండెపోటుతో ఆయన నిద్రలోనే మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కాలిఫోర్నియాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా కిరణ్ పనిచేస్తున్నారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న కిరణ్ 1వ తేదీ నుంచి ఆఫీసు రాకపోవడంతో కంపెనీ ప్రతినిధులు స్నేహితులకు సమాచారం ఇచ్చారు. ఫోన్ ఎత్తకపోవడంతో అనుమానం వచ్చిన స్నేహితులు రూమ్ వద్దకు వెళ్లి చూడగా మృతిచెందినట్లు గుర్తిం చారు. దీంతో కుటుంబసభ్యులకు, పోలీసులకు వారు సమాచారం ఇచ్చారు. మృతదేహం కర్నూలుకు తీసుకురావడానికి నాలుగు రోజుల సమయం పడుతుందని సమాచారం. గఫూర్ కుమారుడి మరణం పట్ల సీపీఎం పార్టీ సంతాపం తెలిపింది.

**కిరణ్ మృతికి మంత్రి లోకేష్ సంతాపం**

'సీపీఎం నేత, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ గారి తనయుడు, అమెరికాలో సీనియర్ డేటా సైంటిస్టుగా పని చేస్తున్న కిరణ్ ఆకస్మిక మరణం నన్ను కలచివేసింది. ఇది ఆ కుటుంబానికి తీరని లోటు. గఫూర్ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. కిరణ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.' అంటూ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం వేదికగా కిరణ్ మృతికి సంతాపం తెలిపారు.

# ప్రకృతి సేద్యంలో దేశానికే ఏపీ ఆదర్శం

- రసాయన ఎరువుల వాడకం తగ్గింది
- రైతులకు ఆదాయం పెరిగింది
- ఏపీ నాచురల్ ఫార్మింగ్ విధానాలకు మోదీ ప్రశంసలు
- టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్యరథం): ప్రకృతి సేద్యంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానానికి చేరుకుందని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి రైతులకు అధిక ఆదాయాన్ని అందించడంలో రాష్ట్రం సరికొత్త రికార్డులు సృష్టిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. శనివారం ఆయన ప్రకృతి సేద్యం పెంపు, పీఎండీఎస్ అంశాలపై వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు, కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్లు, రైతులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో ప్రకృతి వ్యవసాయం విజయవంతం కాదని కొందరు దుష్ప్రచారం చేశారన్నారు. 2016లో కేవలం 40వేల మంది రైతులతో ప్రారంభమైన ఈ పయనం నేడు 17.73 లక్షల మందికి చేరిందని సీఎం ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం చేసేలా ప్రోత్సహిస్తున్నామని స్పష్టం చేశారు. రసాయన ఎరువులతో పోలిస్తే ప్రకృతి సేద్యం ద్వారా రైతుల ఆదాయం 47 శాతం పెరిగింది. పత్తి పంటలో 96 శాతం, కందుల పంటలో 87 శాతం మేర నికర రాబడి లభిస్తోందన్నారు. ప్రకృతి సాగు భూతాపాన్ని తగ్గించి, చిన్నపాటి వర్షపాతంతోనూ పంటలను కాపాడుకునేలా ఉపయోగపడుతుం దన్నారు. ఎల్‌నినో లాంటి తీవ్ర కరవు పరిస్థితులను కూడా ఈ సేద్యం తట్టుకుంటుందన్నారు.

'2023-24 కంటే ముందు సంవత్సరాలతో పోలిస్తే రాష్ట్రంలో 6 శాతం, ఈ ఏడాది మరో 2.28 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గింది. రసాయనాలు తగ్గించినందుకు గానూ కేంద్రం ఇచ్చే రూ.218 కోట్ల ప్రోత్సాహకాల కోసం ఇప్పటికే లేఖ రాశాం. ప్రకృతి సేద్యంలో గుజరాత్ కంటే ఏపీనే అగ్రస్థానంలో ఉందంటూ ఇటీవల స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ సైతం ప్రశంసించారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ద్వారా కేంద్రం కూడా ఆసరాగా నిలుస్తోంది.' అని సీఎం గుర్తు చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా 500 టీఎంసీల గోదావరి వరద జలాలను కృష్ణా డెల్టాకు తరలించి సద్వినియోగం చేశామన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకోవడానికి అనంతపురం జిల్లాలోనే 10 లక్షల పంట కుంటలు, చెక్ డ్యామ్‌లు, ట్రెంచ్‌లు తవ్వించామని చెప్పారు. కషాయాలు, జీవామృతం తయారీకి అవసరమైన దేశీయ ఆవుల పెంపకం కోసం మరిన్ని గోకులాలు నిర్మిస్తామని వెల్లడించారు. ఈ నెల 15న నిర్వహించే 'సరస్ మేళా'లో ప్రకృతి సేద్య విధానాలను ప్రత్యేకంగా ప్రదర్శిస్తామని చెప్పారు. ప్రకృతి సేద్యాన్ని యుద్ధప్రాతిపదికన ముందుకు తీసుకెళ్తున్న రైతులు, అధికారులు, కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక అభినందనలు తెలిపారు.




# అభివృద్ధికి చిరునామాగా మచిలీపట్నాన్ని తీర్చిదిద్దుతాం

- మంత్రి కొల్లు రవీంద్ర ఉద్ఘాటన
- పండుగ వాతావరణంలో మంత్రి ప్రజా పాదయాత్ర
- అడుగడుగునా నిరాజనాలు పట్టిన జనం
- చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరిస్తూ సాగిన యాత్ర

మచిలీపట్నం (చైతన్యరథం): మచిలీపట్నం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోని అత్యుత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దేవరకు విశ్రమించేది లేదని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన ప్రజా పాదయాత్ర 10వ రోజు శనివారం 38, 39, 40 డివిజన్లో సాగింది. అడుగున జననీరాజనాలతో ఆద్యంతం పండుగ వాతావరణంలో పాదయాత్ర కొనసాగింది. 38వ డివిజన్ పరిధిలోని చల్లరాస్తా సెంటర్, విజయవాడ రోడ్డు, కన్యకా రైస్ మిల్ కోరి సెంటర్ మీదుగా 39వ డివిజన్లోని శంకరమఠం, దుంపా వారి వీధిలోని రామాలయం వరకు కొనసాగింది. పాదయాత్రలో మంత్రి రవీంద్ర అడుగున సామాన్య పౌరులతో ముచ్చటిస్తూ, వారి సమస్యలు అడిగి తెలుసుకుని వీలైనంతవరకు అక్కడే పరిష్కరిస్తూ ముందుకు సాగారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండున్నర ఏళ్ల కూటమి ప్రభుత్వ పరిపాలనలో గతంలో ఎన్నడూ లేని అభివృద్ధిని సాధ్యం చేశామని తెలిపారు. గత ప్రభుత్వం మాటలు చెప్పి కాలయాపన చేసింది. కానీ నేడు చెప్పిన ప్రతి మాటను తూచా తప్పకుండా అమలు చేస్తున్నాము. సంక్షేమం, అభివృద్ధిని ప్రతి గడపకు చేరవేశాం. బందరు ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పోర్టును మరో ఆరు నెలల్లో ప్రారంభించనున్నాము. పోర్టుకు అనుబంధంగా గోవా షిప్పింగ్ సంస్థ రూ.8 వేల కోట్లు పెట్టుబడి కూడా పెడుతోంది. దీంతో దాదాపు పదివేల మందికి ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు రానున్నాయి. మరో రూ.10 వేల కోట్ల విలువైన అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయి.

మంగినపూడి సముద్ర తీరానికి పర్యాటక శోభ తీసుకొచ్చే లక్ష్యంతో గతేడాది బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తే.. ఈ సంవత్సరం మహా గణపతి ఉత్సవాలు నిర్వహించాము. తద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాం. ఇప్పటికే ఈ ప్రాంతంలో అనేక రిసార్టులు ఏర్పాటు చేసేందుకు ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ముందుకు వస్తున్నాయి. పర్యాటక రంగం పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందిత మచిలీపట్నంలో యువతకు పుష్కలంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

మచిలీపట్నం నియోజకవర్గాన్ని ఆదర్శంగా మలిచే లక్ష్యంతో దాదాపు రూ.300 కోట్ల వ్యయంతో రోడ్లు, డ్రైనేజీలు, డివైడర్లు, పార్కులు అభివృద్ధి చేస్తున్నాం. మరింత అభివృద్ధి చేసేలా సాస్కి నిధులు, 15 వ ఆర్థిక సంఘం నిధులు తీసుకొచ్చి పనులు చేస్తున్నాను. ఇన్ని రకాలుగా అభివృద్ధి చేస్తుంటే గొడ్డలి పార్టీ నాయకులు బందరు అభివృద్ధిపై కుట్రలు చేస్తున్నారు. బందరు పోర్టుని పూర్తి చేయనీయకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు. అలాంటి దుర్మార్గుల విషయంలో నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

# జగన్ అక్రమాస్తుల కేసులు.. త్వరగా తేల్చండి

- తెలంగాణ హైకోర్టులో ఈడీ పిటిషన్
- జగన్ సహా నిందితులందరి వ్యక్తిగత హాజరుకు ఆదేశించి, రోజువారీ విచారణ జరపాలని అభ్యర్థన
- దశాబ్దానికిపైగా కేసులు ముందుకు కదలటం లేదు, త్వరగా తేల్చాలని వినతి
- ఇకనైనా జగన్ పాపాల లెక్క తేలుతుందా?

అమరావతి (చైతన్యరథం): తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్ర సంపదను దోచుకుతిన్న జగన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల్లో ఎట్టకేలకు కదలిక వచ్చేలా కనిపిస్తోంది. దశాబ్దానికి పైగా న్యాయస్థానాల్లో నాన్చుతూ వస్తున్న వేల కోట్ల రూపాయల అక్రమాస్తుల కేసులకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజా చర్య జగన్ గుండెల్లో వణుకు పుట్టిస్తోంది. జగన్ అక్రమాస్తుల కేసులపై రోజువారీ విచారణ జరిపి వేగంగా తేల్చాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులో ఈడీ పిటిషన్ దాఖలు చేసింది. జగన్ సహా నిందితులందరినీ వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని కోరింది. సీబీఐ కోర్టులో 9 ఈడీ ఛార్జిషీట్లు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని పిటిషన్లో పేర్కొంది. సీబీఐ కోర్టులో డిశ్చార్జి పిటిషన్లు తేలకపోవడంతో విచారణ ముందుకు వెళ్లడం లేదని తెలిపింది. ఆర్థిక నేరాలను దేశ ఆర్థిక రంగానికే ముప్పుగా పరిగణించాలని కోరారు. దశాబ్ద కాలంగా నాన్చుతూ వస్తున్న ఈ కేసుల విచారణను కొలిక్కి తెచ్చేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ నేరుగా హైకోర్టు గడప తొక్కడం వైసీపీలో తీవ్ర కలకలం రేపుతోంది.

ఈ కేసు మూలాలను ప్రస్తావిస్తూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా వైఎస్ రాజశేఖర రెడ్డి ఉన్న కాలంలో పలు కార్పొరేట్ కంపెనీలు, బడా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అడ్డగోలుగా ప్రయోజనాలు కల్పించిందని ఈడీ స్పష్టం చేసింది. దానికి ప్రతిఫలంగా క్విడ్ ప్రో కో పద్ధతిలో జగన్ మోహన్ రెడ్డికి, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన వ్యాపార సంస్థల్లోకి భారీగా అక్రమ పెట్టుబడులు వచ్చాయని తెలిపింది. ఈ ఆరోపణలపై గతంలో ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకే ఐపీసీ, అవినీతి నిరోధక చట్టాల కింద సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని, దాని ఆధారంగానే తాము మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు ప్రారంభించామని ఈడీ ప్రెస్ నోట్‌లో వెల్లడించింది.

తమ దర్యాప్తులో విస్తుపోయే ఆర్థిక అక్రమాలు వెలుగుచూశాయని ఈడీ పేర్కొంది. అరబిందో ఫార్మా, హెటెరో డ్రగ్స్, ఇందు ప్రాజెక్ట్స్, ఇందు టెక్ జోన్, లేపాక్షి నాలెడ్జ్ హబ్, వాన్‌పిక్ ప్రాజెక్ట్స్, వాన్‌పిక్ పోర్ట్స్, నిమ్మగడ్డ ప్రసాద్, రాంకీ ఫార్మా సిటీ, ఇండియా సిమెంట్స్ వంటి సంస్థలు భారీ ఎత్తున నిధులను మళ్లించినట్లు గుర్తించామని వివరించింది. ఈ సంస్థలన్నీ జగన్ మోహన్ రెడ్డి, ఆయన కుటుంబానికి చెందిన భారతి సిమెంట్స్, జగతి పబ్లికేషన్స్, జననీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి కంపెనీల్లో వాస్తవ విలువ కంటే ఎన్నో రెట్లు అధిక ధరలకు షేర్లను కొనుగోలు చేస్తూ అక్రమ పెట్టుబడులు పెట్టాయని ఈడీ పూర్తి ఆధారాలతో స్పష్టం చేసింది.

హైదరాబాద్ నాంపల్లిలోని ప్రత్యేక సీబీఐ కోర్టులో జగన్, ఇతరులపై తాము మొత్తం 9 ఛార్జిషీట్లు సమర్పించామని, న్యాయస్థానం వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుందని ఈడీ గుర్తుచేసింది. అయితే, నిందితులు కావాలనే వరుసగా దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్ల కారణంగా ఈ కేసులు ఇప్పటికీ ప్రాథమిక దశలోనే నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రిసైడింగ్ ఆఫీసర్ల బదిలీలు, ఇతర కారణాలతో డిశ్చార్జ్ పిటిషన్లపై తుది నిర్ణయం రాకపోవడం వల్ల దాదాపు పదేళ్లుగా విచారణలో ఎలాంటి పురోగతి లేకుండా తీవ్ర జాప్యం జరుగుతోందని ఈడీ అసంతృప్తి వ్యక్తం చేసింది.



ఆర్థిక నేరాలు సాధారణ నేరాల వంటివి కావని, దేశ ఆర్థిక వ్యవస్థను కుంగదీసే ఇలాంటి తీవ్రమైన కుట్రలను ప్రత్యేక దృష్టితో విచారించాలంటూ గతంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను ఈడీ ప్రత్యేకంగా ఉటంకించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించిన వేగవంతమైన న్యాయ విచారణ హక్కు ఆధారంగా.. న్యాయవ్యవస్థలో విచారణలు ఇక ఏమాత్రం ఆలస్యం కాకుండా ముగియాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది.

జగన్ కేసులు త్వరగా తేల్చాలని గతంలోనూ పిటిషన్ దాఖలైనట్లు హైకోర్టు గుర్తించింది. చేగొండి హరిరామజోగయ్య, ఇతరుల పిటిషన్లతో కలిపి ఈడీ పిటిషన్‌ను జత చేయాలని న్యాయస్థానం దేశించింది. జగన్ కేసులను వేగంగా విచారణ జరపాలనే అన్ని పిటిషన్లను కలిపి ఈనెల 13వ తేదీన తెలంగాణ హైకోర్టు విచారణ జరపనుంది. ఈడీ వాదనల ప్రకారం ఇక విచారణ నుంచి జగన్ రెడ్డి అండ్ గ్యాంగ్ తప్పించుకోవడం కష్టమన్న అభిప్రాయం వినిపిస్తోంది. పాపం పండే రోజు ముంచుకొస్తోందని అనుకోవచ్చు.

చైతన్యరథం

# వేగంగా రాజధాని అమరావతి పనులు

- రైతుల ప్లాట్లు, రోడ్లు, భవన నిర్మాణాలపై కాంట్రాక్ట్ సంస్థలకు టార్గెట్లు
- 2028 అక్టోబర్ నాటికి రాజధాని నిర్మాణం పూర్తి చేయటమే లక్ష్యం
- అధికారులు, ప్రజాప్రతినిధుల భవనాలు దాదాపు పూర్తి
- నవంబర్ 11 తర్వాత ప్రారంభోత్సవాలు
- భూ సమీకరణ జరుగుతున్న గ్రామాల్లో పెండింగ్‌లో స్థానిక ఎన్నికలు
- పురపాలకశాఖ మంత్రి నారాయణ వెల్లడి
- అమరావతి నిర్మాణ పనులపై మంత్రి సమీక్ష



అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, నిర్దేశిత లక్ష్యం ప్రకారం నిర్మాణాలు పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిపై శనివారం మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెట్) ఇంజినీర్లు, వివిధ కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో సమావేశమైన మంత్రి.. రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పనులు, భవన నిర్మాణాల పురోగతిని సమీక్షించారు. ప్రతి నిర్మాణ సంస్థకు పనుల పూర్తిపై నిర్దిష్ట లక్ష్యాలను విధించారు.

నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలం దాదాపు ముగిసిన నేపథ్యంలో నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, కార్మికుల సంఖ్యను మరింత పెంచడంతో పాటు అవసరమైన నిర్మాణ సామగ్రి సరఫరాను పెంచాలని సూచించారు. అనంతరం రాజధానిలో నిర్మాణంలో ఉన్న ఐకానిక్ టవర్ల పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిగతులు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, తదుపరి చేపట్టాల్సిన పనులపై ఇంజినీర్లు, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో చర్చించారు.

### వర్షాలతో పనులకు అంతరాయం.. ప్రస్తుతం వేగంగా పనులు

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. గత నెలలో కురిసిన వర్షాల కారణంగా అమరావతి నిర్మాణ పనులకు అంతరాయం కలిగిందని తెలిపారు. ప్రస్తుతం రాజధానిలో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. వర్షాకాలం దాదాపు ముగియడంతో పనులను మరింత వేగవంతం చేయాలని, నిర్దేశించిన లక్ష్యాల మేరకు నిర్మాణాలను పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థలకు సూచించినట్లు తెలిపారు.

### ఐకానిక్ టవర్లలో తొలి డయాగ్రిడ్ పూర్తి

రాజధానిలో నిర్మాణంలో ఉన్న ఐకానిక్ టవర్ల నిర్మాణంలో మొదటి డయాగ్రిడ్ పూర్తయిందని మంత్రి వెల్లడించారు. ప్రతి రెండు నెలలకు ఆరు అంతస్తుల నిర్మాణం పూర్తవుతోందని తెలిపారు. ఐకానిక్ అసెంబ్లీ, హైకోర్టు భవనాల ఫౌండేషన్ పనులు దాదాపు పూర్తయ్యాయని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధుల కోసం నిర్మిస్తున్న భవనాలు కూడా దాదాపు పూర్తయ్యాయని పేర్కొన్నారు. సిద్ధమైన భవనాల ప్రారంభోత్సవాలను వచ్చే నవంబర్ 11 తర్వాత నుంచి నిర్వహిస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు.

### 350 కిలోమీటర్ల ట్రంక్ రోడ్లు.. 1,500 కిలోమీటర్ల లేఅవుట్ రోడ్లు

అమరావతిలో 350 కిలోమీటర్ల ట్రంక్ రోడ్లు, 1,500 కిలోమీటర్ల లేఅవుట్ రోడ్ల నిర్మాణంతో పాటు ఇతర మౌలిక సదుపాయాల పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ప్రతి నిర్మాణ సంస్థకు పనుల పూర్తిపై లక్ష్యాలను నిర్దేశించామని, ఆ లక్ష్యాల ప్రకారం పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రస్తుతం అమరావతిలో సుమారు 35 వేల మంది కార్మికులతో వివిధ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పనుల వేగాన్ని పెంచేందుకు కార్మికుల సంఖ్యను మరింత పెంచాలని, అవసరమైన నిర్మాణ సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవాలని కాంట్రాక్ట్ సంస్థలను ఆదేశించినట్లు చెప్పారు.

### 2028 అక్టోబర్ నాటికి పూర్తి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన ప్రకారం 2028 అక్టోబర్ నాటికి అమరావతి రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యమని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు, ఇంజినీర్లు, కాంట్రాక్ట్ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.రాజధాని నిర్మాణంపై కొంత మంది అవాకులు, చవాకులు పేలుతున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. అమరావతికి వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు జరుగుతున్నాయో స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. రాజధానిలో జరుగుతున్న నిర్మాణాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తే పనుల పురోగతి అర్థమవుతుందని పేర్కొన్నారు.

### ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ కోసం భూసమీకరణ

అమరావతిలో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు సంబంధించి మూడు గ్రామాల్లో భూసమీకరణ ప్రక్రియ చాలా వరకు పూర్తయిందని మంత్రి నారాయణ తెలిపారు. వచ్చే నెలాఖరుకు 75 శాతానికి పైగా భూసమీకరణ పూర్తవుతుందని వెల్లడించారు. స్పోర్ట్స్ సిటీ అభివృద్ధికి అవసరమైన భూముల సమీకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు.

### డిసెంబర్ నాటికి రోడ్ నెట్‌వర్క్‌పై సింగపూర్ మాస్టర్ ప్లాన్

అమరావతి రోడ్ నెట్‌వర్క్ అభివృద్ధికి సంబంధించి సింగపూర్ సంస్థ డిసెంబర్ నాటికి మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయనుందని మంత్రి తెలిపారు. అమరావతి నుంచి గుంటూరుకు నేరుగా వెళ్లేలా, ప్రస్తుత రహదారికి సమాంతరంగా మరో రహదారిని రూపొందిస్తున్నామని చెప్పారు. రాజధాని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రహదారి నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు.

### ఆ గ్రామాల్లో ప్రస్తుతానికి ఎన్నికలు పెండింగ్

భూసమీకరణ ప్రక్రియ కొనసాగుతున్న గ్రామాల్లో ప్రస్తుతానికి ఎన్నికలను పెండింగ్‌లో పెడుతున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఆయా గ్రామాల్లో భూసమీకరణ ప్రక్రియకు సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి, రహదారులు, మౌలిక సదుపాయాలు, ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలను నిర్దేశిత లక్ష్యాల ప్రకారం పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. నిర్మాణ సంస్థలు పనుల వేగాన్ని పెంచి, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

## బీసీలకు సామాజిక న్యాయం కూటమి లక్ష్యం

- స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా 34 శాతం రిజర్వేషన్లు
- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



అమరావతి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సామాజిక న్యాయం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. బీసీలకు న్యాయం చేసింది టీడీపీయేనన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదిక ఆధారంగా సగటున 28.18 శాతం బీసీ రిజర్వేషన్లు ఇస్తున్నప్పటికీ 34 శాతానికి తక్కువగా ఉన్న చోట పార్టీ పరంగా ఆ లోటు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. దివంగత ఎన్టీఆర్ హయాంలో బీసీలకు 24 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు.. చంద్రబాబు హయాంలో వాటిని 34 శాతానికి పెంచారు. జగన్ ప్రభుత్వం 24 శాతానికి తగ్గించి, బీసీలకు తీరని ద్రోహం చేసిన విషయాన్ని మర్చిపోయి నేడు ఆ పార్టీ నేతలు దొంగ నాటకాలు ఆడుతూ అవాకులు, చవాకులు పేలుతున్నారు. బీసీలకు న్యాయం చేసింది, చేస్తోంది తెలుగుదేశం పార్టీ నే అని మంత్రి సంధ్యారాణి అన్నారు.

## బీసీలకు 34 శాతం కోటా..ఇది టీడీపీ మాట

- పార్టీ పరంగా అమలు చేసేందుకు నిర్ణయం: మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ



అమరావతి (చైతన్యరథం): బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నది తెలుగుదేశం పార్టీ స్పష్టమైన విధానమని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించారని ఆయన ఆరోపించారు. ఈ నిర్ణయం కారణంగా సుమారు 16,800 మంది బీసీలు రాజకీయ పదవులను కోల్పోయారని విమర్శించారు. బీసీలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, వారి హక్కులు, సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

బీసీల రిజర్వేషన్ల అంశంపై వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. గతంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిన బీసీ ద్రోహులైన వైసీపీ నేతలు నేడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసిన జగన్.. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని మాట్లాడుతున్నారని ప్రశ్నించారు.

మరోవైపు.. రాష్ట్రానికి రావాల్సిన సుమారు రూ.12,500 కోట్ల 16 ఆర్థిక సంఘం నిధులను అడ్డుకునేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి, స్థానిక సంస్థల బలోపేతానికి ఈ నిధులు కీలకమని పేర్కొంటూ, నిధుల విషయంలో రాజకీయాలకు తావివ్వకూడదన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీసీ కార్పొరేషన్లు నిర్లక్ష్యానికి గురయ్యాయని.. వాటి కార్యకలాపాలు నిర్వీర్యమై కనీస సదుపాయాలు కూడా లేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. వైసీపీ పాలనలో బీసీ కార్పొరేషన్లలో కనీసం కూర్చునేందుకు కుర్చీలు కూడా లేని దుస్థితి ఏర్పడిందన్నారు. బీసీలకు ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలవడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తోందని తెలిపారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంపొందించడం, వారి హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో భాగమని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

# పట్టిసీమతో రూ.50 వేల కోట్ల సంపద సృష్టి

- చంద్రబాబు దార్శనికతకు నిదర్శనం
- కృష్ణా డెల్టా, రాయలసీమకు ప్రాణం పోసిన ప్రాజెక్ట్
- ‘పంపులు పీకేస్తా’ అన్న జగన్ రెడ్డిని రైతాంగం ఎన్నటికీ క్షమించదు
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి (చైతన్యరథం): పట్టిసీమ ఎత్తిపోతల పథకం రాష్ట్ర రైతాంగానికి వరప్రదాయినిగా మారిందని, ఇది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, అపార అనుభవానికి సజీవ సాక్ష్యమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. సాగు నీటి సంఘాల అధ్యక్షులు, ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్లతో కలసి అమరావతి సచివాలయం లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి నిమ్మల మాట్లాడారు. పట్టిసీమ ద్వారా 2015 నుంచి ఇప్పటి వరకు 500 టీఎంసీల గోదావరి వరద జలాలను కృష్ణా డెల్టాకు మళ్లించడం ద్వారా సుమారు రూ.50 వేల కోట్ల సంపద సృష్టించినట్లు వివరించారు.

**తక్కువ పెట్టుబడి - అత్యధిక సంపద**

రూ.1,600 కోట్ల వ్యయంతో చేపట్టిన పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా నేడు రాష్ట్రంలో రూ.50,000 కోట్ల సంపద సృష్టి జరిగిందని, ఇది తక్కువ పెట్టుబడితో అద్భుత ఫలితాలు సాధించిన ఇంజనీరింగ్ అద్భుతమని కొనియాడారు. వర్షపు చుక్క కోసం ఎదురుచూస్తున్న ప్రస్తుత ‘సూపర్ ఎల్ నినో’ విపత్కర పరిస్థితుల్లో సైతం గోదావరి నుంచి 57 టీఎంసీల నీటిని తరలించి కృష్ణా డెల్టాలో సుమారు 7 లక్షల ఎకరాల ఆయకట్టును కాపాడటంతో పాటు 30 లక్షల మంది ప్రజల తాగునీటి అవసరాలు తీర్చినట్లు తెలిపారు.

**రాయలసీమకు జీవధారగా మారిన వైనం**

పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టా అవసరాలు తీరడంతో, శ్రీశైలం రిజర్వాయర్ నుంచి డెల్టాకు ఒక్క చుక్క నీరు కూడా తీసుకోవాల్సిన అవసరం రాలేదని పేర్కొన్నారు. దీనివల్ల శ్రీశైలంలో మిగిలిన కృష్ణా జలాలను పూర్తిగా రాయలసీమ ప్రాజెక్టులకు, తాగునీటి అవసరాలకు మళ్లించగలిగామని, పట్టిసీమ ప్రత్యక్షంగా కృష్ణా డెల్టాను, పరోక్షంగా రాయలసీమను కాపాడుతోందని మంత్రి రామానాయుడు స్పష్టం చేశారు.

**జగన్ రెడ్డి తీరుపై తీవ్ర ధ్వజం**

నాడు ప్రతిపక్షంలో ఉండగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా పట్టిసీమను ‘ఒట్టి సీమ’ అని, ‘నిధులు వృథా’ అని అవహేళన చేస్తూ అధికారంలోకి వస్తే ‘పంపులు పీకేస్తాం’ అన్న వ్యాఖ్యలను గుర్తుచేశారు. నేడు ఆ పంపులే లక్షలాది మంది రైతుల గొంతు ఎండకుండా కాపాడుతున్నాయని, ఇందుకు జగన్ రాష్ట్ర ప్రజలకు, రైతాంగానికి ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పినా రైతులు క్షమించరని మండిపడ్డారు.

**రైతాంగానికి అండగా నిలిచే ప్రభుత్వమే కావాలి**

హింస, విద్వేషాలను ప్రోత్సహించే ‘గొడ్డలి సంస్కృతి’ ఈ రాష్ట్రానికి అవసరం లేదని, నాగలిని ఆయుధంగా మలచి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తున్న కూటమి ప్రభుత్వ విధానాలే ప్రజలకు శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. పోలవరం పూర్తయ్యేలోగా గోదావరి వరద జలాలు వృథాగా సముద్రం పాలు కాకుండా ఒడిసిపట్టిన ఘనత చంద్రబాబు నాయుడికే దక్కుతుందని కొనియాడారు.

ఈ సమావేశం లో సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ ఎమ్.మురళీధరరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ లు ఎమ్.భోగేశ్వరరావు, తుమ్మల జగదీష్, కొమ్మారెడ్డి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# లీజు పేరుతో 90 సెంట్ల భూమి కబ్జా

- రియల్ ఎస్టేట్ వెంచర్ కోసం వాగు ఆక్రమణ
- 75 ఏళ్లుగా సాగులో ఉన్న భూమి.. రికార్డుల్లో వేరొకరి పేర్లు
- మాగాణి భూమి సరిహద్దుల వివాదం.. సర్వేను అడ్డుకుంటూ దాడులు
- న్యాయం కోసం టీడీపీ కేంద్ర కార్యాలయంలో బాధితుల వినతులు
- అర్జీలు స్వీకరించిన లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్





అమరావతి (చైతన్యరథం): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి పలు సమస్యలపై తరలి వచ్చిన జనం అర్జీలు సమర్పించారు. బాధితుల నుంచి ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, కుమ్మరి శాలివాహన వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన రాంబాబు అభ్యర్థిస్తూ.. పి.గన్నవరం మండలం కారుపల్లిపాడు గ్రామంలోని సర్వే నెం. 9/1 లో తమ పూర్వీకుల నాటి 60 సెంట్ల భూమి ఉందన్నారు. గతంలో కాలువ తవ్వకం కోసం కొంత స్థలం ఇచ్చినందుకు గాను, ర్యాలి కాముట్లు ద్వారా మరో 30 సెంట్లు దఖలుపడింది. వెరసి మొత్తం 90 సెంట్ల భూమిని తమ తండ్రి యండమూరి వీరన్న, సోదరులు, అనంతరం వారి సంతానమైన బాలయోగి, వెంకటేశ్వరరావు, తాను సంపూర్ణ హక్కులతో అనుభవిస్తూ వచ్చాం. 1992లో ఆర్.ఏనుగుపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పీచు ఫ్యాక్టరీ నడపడానికి, పీచు ఎండబెట్టుకోవడానికి లీజుకు ఇమ్మని అడగ్గా, సదరు స్థలాన్ని లీజుకు ఇచ్చారు. తదనంతరం తమకు ఎలాంటి సమాచారం లేకుండా, కుటుంబ సభ్యుల ప్రమేయం లేకుండా సంతకాలను ఫోర్జరీ చేసిన సదరు పీచు ఫ్యాక్టరీ యజమాని ఆ 90 సెంట్ల ఆస్తిని అతడి పేరిట రాయించుకున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్ధించారు.

ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో దక్షిణ బజారు వైపు ఎన్నో ఏళ్లుగా సహజసిద్ధంగా ప్రవహిస్తున్న నాగన్న వాగు ఉందన్నారు. ఈ వాగుకు పశ్చిమ వైపున ఉన్న పట్టా భూమిని ఒక వ్యక్తి రియల్ ఎస్టేట్ వెంచర్ కోసం కొనుగోలు చేశారు. అనంతరం భూమిని విస్తరించుకునేందుకు తూర్పు వైపు ఉన్న నాగన్న వాగును మట్టితో పూడ్చివేశారు. పాత వాగును పూడ్చి, దాని పక్కనే ఉన్న ప్రభుత్వ డి.కె. భూమిలో కొత్తగా వాగును ఇష్టారాజ్యంగా తవ్వారు. దీనివల్ల ప్రవాహ దిశ మారి వర్షాకాలంలో వరద నీరు నేరుగా దక్షిణ బజారు మీదుగా గ్రామంలోకి చొచ్చుకొచ్చే ముప్పు ఏర్పడింది. నాగన్న వాగు వర్షాకాలంలో అత్యంత ఉధృతంగా ప్రవహిస్తుంది. గతంలో ఈ వాగు ఉధృతికి పశువులు, జీవాలు, కార్లు కూడా కొట్టుకుపోయిన దాఖలాలు ఉన్నాయి. ఇప్పుడు వాగు రూపురేఖలు మార్చడంతో గ్రామస్తుల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేకుండా పోతోంది. ప్రశ్నించిన తమపై సదరు వ్యాపారి దౌర్జన్యంగా మాట్లాడుతూ దుర్భాషలాడుతున్నారు. ఈ సమస్యపై ఫిర్యాదు చేయగా ఆర్డీవో ఆదేశాల మేరకు జిల్లా సర్వేయర్ వచ్చి పరిశీలించి, సమస్య పరిష్కారమయ్యే వరకు ఎలాంటి పనులు చేయవద్దని సదరు వ్యాపారిని ఆదేశించారు. అయినప్పటికీ, అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ రాత్రి సమయాల్లో పాత వాగు ఆనవాళ్లు లేకుండా పూడ్చివేత పనులు సాగిస్తున్నారు. తగు చర్యలు తీసుకుని వాగు ఆక్రమణను అడ్డుకోవాలని కోరారు.

పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొత్తూరు గ్రామానికి చెందిన లక్ష్మణ్ నాయక్ విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నంబర్ 461/1 లో 3.00 ఎకరాలు, అలాగే సర్వే నంబర్ 461/2 లో 3.00 ఎకరాలు (మొత్తం 6 ఎకరాలు) భూమిలో గత 75 సంవత్సరాలుగా తాము సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఇది తమ కుటుంబానికి చెందిన పూర్వీకుల వారసత్వ భూమి. ఈ భూమి క్షేత్రస్థాయిలో తమ సాగులో ఉన్నప్పటికీ, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల పేర్లను రెవెన్యూ రికార్డుల్లోకి అక్రమంగా ఎక్కించుకున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం మాధవరం గ్రామానికి చెందిన కె. సుబ్బారావు విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 100/1 లో 42 సెంట్లు, అలాగే సర్వే నంబర్ 101 లో 01 సెంట్ విస్తీర్ణంలో తమకు సంబంధించిన మాగాణి భూమి ఉందన్నారు. ఈ భూమి హద్దులను నిర్ధారించేందుకు రెవెన్యూ సిబ్బందిని పిలిపిస్తే... కొందరు వ్యక్తులు సర్వేయర్లను బెదిరించి వెనక్కి పంపించేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు విధులను సక్రమంగా నిర్వర్తించకుండా అడ్డుకుంటున్నారు. హద్దులు చూపించమని అడిగినందుకు తమపై కర్రలతో భౌతిక దాడులకు దిగుతూ నిత్యం భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం కొండ గూడెం గ్రామానికి చెందిన కరిపోతు కృష్ణ విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నంబర్ 1261/3 లో 1.56 ఎకరాలు, సర్వే నంబర్ 1273/3 లో 1.22 ఎకరాలు, అలాగే సర్వే నంబర్ 1262/2 లో 2.97 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూములను కొంతమంది సంపన్నులు నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించుకున్నారని తెలిపారు. ప్రభుత్వం పేద దళితులకు ఇచ్చిన భూములపై ఎలాంటి బదలాయింపులు చెల్లవని చట్టాలు స్పష్టం చేస్తున్నప్పటికీ, ఈ భూములకు సంబంధించి అక్రమ అమ్మకాలు, కొనుగోళ్లు, అక్రమ మ్యుటేషన్లు కూడా జరిగాయి. దీనివల్ల అసలైన పేదలకు న్యాయం జరగకుండా పోతోంది. ఈ అక్రమాలపై ఇప్పటికే పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా వరుసగా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇప్పటివరకు ఎలాంటి న్యాయం జరగలేదు. తగు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

పల్నాడు రొంపిచర్ల మండలం తుంగపాడు గ్రామానికి బండారి చిట్టెమ్మ విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తమ కుటుంబానికి జీవనాధారమైన 5 ఎకరాల భూమిని స్థానికులైన కొందరు అక్రమంగా ఆక్రమించుకున్నారు. ఈ సమస్యపై తహశీల్దార్, వీఆర్వోలకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. జిల్లా కలెక్టర్‌కు సైతం లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశాను. అయినప్పటికీ న్యాయం చేయకపోగా, గత మూడేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ కాల్వ కింద భూమి పోయిందని సాకులు చెబుతున్నారు. భూమిని కొలిచి మొత్తం ఇవ్వకుండా కొంత తగ్గించి, కేవలం 3 ఎకరాలు మాత్రమే రికార్డుల్లో నమోదు చేస్తామంటూ రెవెన్యూ అధికారులు అన్యాయం చేస్తున్నారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వీటితో పాటు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై పలువురు అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

# 13 నుంచి జాతీయ సరస్ ఆజీవిక మేళా

- దేశం మొత్తం విజయవాడవైపు చూసేలా ఏర్పాట్లు చేయాలి
- అధికారులకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశం
- 'సెర్ప్' కార్యాలయంలో సీఈవో, డైరెక్టర్లతో సమీక్ష



విజయవాడ (చైతన్యరథం): జాతీయ సరస్ ఆజీవిక మేళాను విజయవంతం చేసేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో కృషి చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. విజయవాడలోని పున్నమి ఘాట్‌లో ఈ నెల 13 నుంచి 31వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్న "జాతీయ సరస్ ఆజీవిక మేళా–2026" ఏర్పాట్లపై మంత్రి కొండపల్లి శనివారం విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, డైరెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఢిల్లీ ఎన్‌సీఆర్ బయట తొలిసారిగా విజయవాడలో ఈ జాతీయ మేళా జరగడం మన రాష్ట్రానికే ఎంతో గర్వకారణమన్నారు. మేళా విజయవంతం అయ్యేందుకు ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

దేశవ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మొత్తం 576 స్టాళ్లను ఏర్పాటు చేస్తుండగా... దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి సుమారు 1,500 మంది స్వయం సహాయక మహిళా సంఘాల మహిళా ప్రతినిధులు పాల్గొంటారని మంత్రి తెలిపారు. ఈ మేళాలో చేనేత వస్త్రాలు, హస్తకళలు, సహజ ఆహార ఉత్పత్తులు, లైవ్ ఫుడ్ కోర్టులు, ఎఫ్‌పీవో, సీఎల్ఎఫ్, సరస్ శక్తి కలెక్షన్ స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణ కానున్నాయని మంత్రి పేర్కొన్నారు. లక్షపతి దీదీ పెవిలియన్, బయ్యర్–సెల్లర్ పెవిలియన్, కన్వర్జెన్స్ పెవిలియన్, నాలెడ్జ్ సెంటర్, డెమాన్‌స్ట్రేషన్ ఏరియాలను మేళాలో అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారన్నారు.

ఈ జాతీయ మేళాకు ప్రతిరోజూ 50వేల నుంచి లక్ష మంది వరకు సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్నామని, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ నెల 15న మేళాను ప్రారంభించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఇటు దసరా ఉత్సవాల రద్దీని దృష్టిలో ఉంచుకుని.. భద్రతా ఏర్పాట్లపై దృష్టి సారించడంతో పాటు 24 గంటలు వైద్య బృందాలు, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే ఫుడ్ స్టాల్స్‌లో ఆహార నాణ్యత తనిఖీలు నిరంతరం జరగాలని అధికారులకు సూచనలు చేశారు. ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణ, సురక్షిత తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కల్పనలో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే స్వయం సహాయక సంఘాల మహిళలకు రవాణా, వసతి, ఆతిథ్య ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు రానివ్వకూడదన్నారు. సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ మేళా పూర్తయ్యే వరకు ప్రతిరోజూ సమీక్షలు నిర్వహించాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సదుపాయం కల్పించే ఈ గొప్ప మేళాను విజయవంతం చేసి మన రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచేందుకు అధికారులు అందరూ సమిష్టిగా పని చేయాలని మంత్రి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.



## పాకాల బీచ్‌లో యువకుల మృతి బాధాకరం

- మంత్రి నారా లోకేష్

అమరావతి (చైతన్యరథం): ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకాల బీచ్‌లో సముద్ర స్నానానికి వెళ్లి యువకులు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మంత్రి నారా లోకేష్ తెలిపారు. కనిగిరి మండలం శ్రీరంగాపురానికి చెందిన ఏడుగురు యువకులు సముద్రంలో గల్లంతవగా, ఐదుగురిని మెరైన్ సిబ్బంది వెలికితీశారు. వారిలో ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురిని విషమ పరిస్థితిలో ఆసుపత్రికి తరలించారు. గల్లంతైన మరో ఇద్దరి కోసం మెరైన్ పోలీసులు, మత్స్యకారులు గాలిస్తున్నారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించినట్లు లోకేష్ తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పేర్కొన్నారు.

# తిరుమల శ్రీవారికి కానుకగా బంగారు లాకెట్, ముత్యాల హారం



తిరుమల (చైతన్యరథం): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారికి జైపూర్‌కు చెందిన ఆర్తి బిందాల్ దంపతులు సుమారు రూ.51.55 లక్షల విలువ చేసే ఆభరణాలను కానుకగా ఇచ్చారు. వీటిలో రూ.44.35 లక్షల విలువైన, వజ్రాలు, రత్నాలు పొదిగిన 147 గ్రాముల బరువున్న బంగారు లాకెట్, రూ.7.20 లక్షల విలువైన, వజ్రాలు, కెంపులు పొదిగిన 27 గ్రాముల మూడు వరుసల ముత్యాల హారం ఉన్నాయి. శనివారం దాతలు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కలిసి ఆభరణాలను అందజేశారు.

## సంగం ఐటీఐకి రూ.5 కోట్ల సీఎస్ఆర్ నిధులు

మంత్రి ఆనం ప్రత్యేక చొరవ



సంగం (చైతన్యరథం): ఆత్మకూరు నియోజకవర్గంలో విద్యా, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించే లక్ష్యంతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సంగం మండలం తరుణవాయి వద్ద లగడపాటి ఫౌండేషన్‌కు చెందిన భవనాలను విద్యా సంస్థల ఏర్పాటుకు వినియోగించే ప్రతిపాదనలో భాగంగా బిర్లా గ్రూప్ ప్రతినిధులు వాటిని పరిశీలించారు. సంగం ఐటీఐ అభివృద్ధికి రూ.5 కోట్ల సీఎస్ఆర్ నిధులతో నూతన భవన బ్లాక్ నిర్మించేందుకు సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు ప్రతినిధులు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో సమావేశమై నిర్మాణ పనుల ప్రారంభం, అవసరమైన మౌలిక సదుపాయాలపై చర్చించారు. తరుణవాయి వద్ద రూ.100 కోట్లకు పైగా విలువైన ఆస్తులను విద్యాభివృద్ధికి వినియోగించడం ద్వారా గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది ప్రతిపాదన.

# 271 మద్యం దుకాణాలకు రెండో విడత నోటిఫికేషన్

- 19 అర్ధరాత్రి వరకు దరఖాస్తులు
- 21న ఉదయం 8 గంటలకు లాటరీ



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో 2026–27 మద్యం దుకాణాల విధానంలో భాగంగా తొలి విడతలో కేటాయింపు కాని 271 మద్యం దుకాణాలకు ప్రభుత్వం రెండో విడతలో నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఈ దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించనున్నారు. తొలి విడతలో మిగిలిపోయిన దుకాణాలకు కేటాయింపులు పూర్తి చేసేందుకు ఈ చర్య తీసుకున్నట్లు నిషేధ, ఎక్సైజ్ శాఖ కమిషనర్ చామకూరి శ్రీధర్ తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,736 ఏ4 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వగా, 2,929 దుకాణాలు పునరుద్ధరణ ద్వారా, 517 దుకాణాలు తొలి విడత లాటరీ ద్వారా కేటాయించినట్లు వివరించారు. మరో 19 దుకాణాలకు గడువు పొడిగింపు ద్వారా కేటాయింపులు జరిగాయని తెలిపారు. మొత్తంగా 3,465 దుకాణాల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని, ఇది మొత్తం దుకాణాల్లో సుమారు 93 శాతమని పేర్కొన్నారు.

రెండో విడత నోటిఫికేషన్‌లో 267 సాధారణ కేటగిరీ దుకాణాలు, నాలుగు రిజర్వుడు కేటగిరీ దుకాణాలు ఉన్నాయి. అర్హత కలిగిన ఆసక్తిగల వారు నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో దుకాణానికి తిరిగి చెల్లించని దరఖాస్తు రుసుము రూ.3 లక్షలుగా నిర్ణయించారు.

దరఖాస్తులను అక్టోబర్ 19వ తేదీ అర్ధరాత్రి వరకు స్వీకరిస్తారు. అక్టోబర్ 21వ తేదీ ఉదయం 8 గంటలకు సంబంధిత జిల్లా కలెక్టర్ల కార్యాలయాల్లో లాటరీ నిర్వహిస్తారు. ఎంపికైన దరఖాస్తుదారులకు అదే రోజు సమాచారం అందిస్తారు. కేటాయింపుల ప్రక్రియను ఎక్సైజ్ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. అర్హులైన వారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జిల్లాల వారీగా వైఎస్సార్ కడపలో అత్యధికంగా 33 దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఎస్‌పీఎస్ నెల్లూరులో 24, గుంటూరు, తిరుపతి జిల్లాల్లో 19 చొప్పున, పశ్చిమ గోదావరిలో 17, ప్రకాశంలో 16, అనంతపురంలో 15 దుకాణాలు ఉన్నాయి. అనకాపల్లి, కృష్ణా జిల్లాల్లో 13 చొప్పున, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 12 చొప్పున, మార్కాపురంలో 11, శ్రీకాకుళంలో 10 దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేశారు.

కాకినాడ, నంద్యాల జిల్లాల్లో ఎనిమిది చొప్పున, శ్రీ సత్యసాయి జిల్లాలో ఏడు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమలో ఆరు, ఏలూరు, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో ఐదు చొప్పున దుకాణాలు ఉన్నాయి. అన్నమయ్యలో నాలుగు, చిత్తూరులో మూడు, అల్లూరి సీతారామరాజు, కర్నూలు, ఎన్టీఆర్ జిల్లాల్లో రెండు చొప్పున దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. తూర్పు గోదావరి, పోలవరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో రెండో విడత నోటిఫికేషన్ ఆవశ్యకత రాలేదు.

## బీసీలకు రాజకీయ భరోసా..

# టీడీపీతోనే సామాజిక న్యాయం!

- ఎన్టీఆర్ వేసిన పునాదులు.. చంద్రబాబు కొనసాగిస్తున్న బీసీ సాధికారత
- జగన్ పాలనలో 34 శాతం నుంచి 24.15 శాతానికి తగ్గిన రిజర్వేషన్లు
- కోర్టు అడ్డంకులు ఎదురైనా వెనకడుగు లేదు.. పార్టీపరంగా 34 శాతం సీట్లకు హామీ




బీసీలకు రాజకీయ అధికారం కల్పించాలనే ఆలోచనకు కార్యరూపమిచ్చిన పార్టీ తెలుగుదేశం. బడుగు, బలహీన వర్గాలు కేవలం ఓటర్లుగా మిగిలిపోకూడదని, పాలనలో భాగస్వాములై తమ హక్కులను తామే కాపాడుకునే స్థాయికి ఎదగాలని అన్న ఎన్టీఆర్ ఆశించారు. ఆ ఆలోచనకు అనుగుణంగా బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించారు. తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో వాటిని 34 శాతానికి పెంచడం ద్వారా స్థానిక సంస్థల్లో బీసీల రాజకీయ ఎదుగుదలకు మరింత బలమైన పునాది పడింది. నాలుగు దశాబ్దాలుగా టీడీపీకి, బీసీలకు మధ్య కొనసాగుతున్న అనుబంధానికి ఇదే ప్రధాన కారణం. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం అంటే కొన్ని సీట్లు కేటాయించడం మాత్రమే కాదు. గ్రామాల్లో నిర్ణయాలు తీసుకునే స్థానం నుంచి జిల్లా స్థాయి పాలనా వ్యవస్థల వరకు వారికి భాగస్వామ్యం కల్పించడం. సర్పంచులుగా, ఎంపీటీసీలుగా, జెడ్పీటీసీలుగా, మున్సిపల్ కౌన్సిలర్లుగా, మేయర్లుగా బీసీలు ఎదిగేందుకు రిజర్వేషన్లు కీలకమైన మార్గాన్ని చూపించాయి. ఈ అవకాశాలు మరింత విస్తరించాలనే లక్ష్యంతోనే తెలుగుదేశం పార్టీ తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. కానీ, బీసీలకు దక్కిన ఈ రాజకీయ అవకాశాలకు వైసీపీ పాలనలో గండి పడింది. స్థానిక సంస్థల్లో 34 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను వైసీపీకి చెందిన వారితో హైకోర్టులో పిటిషన్ వేయించి 24 శాతానికి కుదించింది. దీంతో 16,800 మంది బీసీలకు రాజ్యాంగబద్ధంగా అందాల్సిన పదవులను దూరం చేసింది. 34 శాతం రిజర్వేషన్లు కొనసాగి ఉంటే బీసీలు ప్రజాప్రతినిధులుగా ఎదిగే అవకాశం ఉండేదని చెబుతోంది. బీసీల రాజకీయ భవిష్యత్తుపై ఇంతటి ప్రభావం చూపిన అంశాన్ని వైసీపీ పాలనలో జరిగిన పరిణామాల నుంచి వేరు చేసి చూడలేం.

### జగన్ పాలనలో కోల్పోయిన అవకాశాలు.. కూటమి పాలనలో తిరిగి సాధించే ప్రయత్నం:

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినప్పుడు అది కేవలం ఎన్నికల ప్రకటనగానే మిగిలిపోతుందని భావించిన వారికి, ప్రభుత్వం తీసుకున్న చర్యలు సమాధానంగా నిలిచాయి. జీవో నంబర్లు 105, 1065లను జారీ చేసి రిజర్వేషన్ల అమలుకు అడుగులు వేసింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుంటే చూసి ఓర్వలేని గొడ్డలి పార్టీ మళ్లీ హైకోర్టులో పిటిషన్లు వేయించింది. హైకోర్టులో జీవోలను కొట్టేయడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించినా ప్రభుత్వం ఆశించిన ఫలితం దక్కలేదు. కానీ, ఒక ప్రభుత్వం న్యాయస్థానంలో ఎదురుదెబ్బను ఎదుర్కొన్నంత మాత్రాన బీసీలకు న్యాయం చేయాలనే లక్ష్యం తప్పు కాదు. రిజర్వేషన్ల అమలుకు రాజ్యాంగపరమైన నిబంధనలు, న్యాయస్థానాల మార్గదర్శకాలు, శాస్త్రీయ గణాంకాలు అవసరం. ఆ నిబంధనలకు అనుగుణంగా మార్గాలను అన్వేషిస్తూ, బీసీలకు న్యాయం జరిగేలా ప్రయత్నాలు కొనసాగించడమే బాధ్యతాయుతమైన పాలన. ఇక్కడే కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధిని గుర్తించాలి. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ప్రత్యేక అంకితభావ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 2026 ఫిబ్రవరి 19న జీవో ఎంఎస్ నంబర్ 3 ద్వారా రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో కమిషన్‌ను నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పర్యటించి, స్థానిక సంస్థల స్థాయిలో వివరాలు సేకరించి నివేదిక రూపొందించే ప్రక్రియ చేపట్టింది. బీసీ మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి సీనియర్ న్యాయవాదులతో సంప్రదింపులు జరపడం, వివిధ రాష్ట్రాల్లో రిజర్వేషన్లపై వెలువడిన తీర్పులను పరిశీలించడం కూడా ఈ ప్రయత్నాల్లో భాగమే. రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ నినాదంగా కాకుండా, న్యాయపరంగా పరిష్కరించాల్సిన బాధ్యతగా కూటమి ప్రభుత్వం తీసుకుందని ఈ చర్యలు సూచిస్తున్నాయి. సుప్రీంకోర్టులో ఎదురైన ప్రతికూల పరిణామాలు పోరాటానికి ముగింపు కావు. బీసీలకు న్యాయం జరిగే మార్గాలను మరింత పకడ్బందీగా అన్వేషించాల్సిన అవసరాన్ని అవి గుర్తుచేస్తున్నాయి.

### బీసీలకు 34 శాతం సీట్లు.. కూటమి ఇచ్చిన రాజకీయ భరోసా

చట్టపరమైన రిజర్వేషన్ల విషయంలో అడ్డంకులు ఎదురైనప్పటికీ, బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గనివ్వబోమని తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున బీసీలకు 34 శాతం సీట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చింది. ఈ నిర్ణయం ప్రాధాన్యం కలిగినది. ఎందుకంటే, చట్టపరమైన రిజర్వేషన్ల సాధనకు సమయం పట్టినా, పార్టీ నిర్ణయాల ద్వారా బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించవచ్చు. గ్రామపంచాయతీ వార్డు సభ్యుల నుంచి సర్పంచుల వరకు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఛైర్‌పర్సన్లు, మేయర్ల వరకు బీసీలు పోటీ చేసే అవకాశాలను పెంచడం అవసరం. రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి ఉన్న బీసీ యువతకు ప్రోత్సాహం అందించాలి. ఇప్పటికే ప్రజాసేవలో ఉన్న బీసీ నాయకులకు మరింత ఉన్నతస్థాయికి ఎదిగే అవకాశాలు కల్పించాలి. ఈ విధంగా పార్టీ పరంగా ఇచ్చిన హామీని ఆచరణలోకి తీసుకురాగలిగితే, స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యం బలోపేతమవుతుంది. ప్రత్యేక కమిషన్ సిఫారసుల ఆధారంగా స్థానిక సంస్థల్లో గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు 26.73 శాతం, సర్పంచులకు 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు 24.60 శాతం, జిల్లా పరిషత్ ఛైర్మన్లకు 23.08 శాతం రిజర్వేషన్లు కల్పించనుంది. పట్టణ స్థానిక సంస్థల్లో వార్డు సభ్యులకు 32.78 శాతం, మున్సిపల్ ఛైర్‌పర్సన్లకు 33.02 శాతం, మేయర్లకు 35.29 శాతం ప్రతిపాదించారు. అన్ని పదవుల్లోనూ బీసీలకు ఒకే శాతం రిజర్వేషన్లు లేకపోవడంతో, రాజకీయంగా వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం మరింత పెరుగుతోంది. చట్టపరమైన రిజర్వేషన్ల కోసం పోరాటం కొనసాగిస్తూనే, పార్టీ తరఫున 34 శాతం సీట్లు కేటాయిస్తామన్న హామీని నిలబెట్టుకోవడం కూటమి ప్రభుత్వానికి, టీడీపీకి కీలకమైన బాధ్యత.

### బీసీలపై వైసీపీ మాటలకు.. టీడీపీ చేతలకు తేడా ఇదే

బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఉంటే వారి రాజకీయ అవకాశాలను కాపాడేందుకు అధికారంలో ఉన్నప్పుడే బలమైన చర్యలు తీసుకోవాలి. కానీ, 34 శాతం రిజర్వేషన్లు 24 శాతానికి పడిపోయింది.. వైసీపీ పాలనలోనే చోటుచేసుకుంది. ఇప్పుడు బీసీలపై ప్రేమ ఉన్నట్లు మాట్లాడటం కంటే, గతంలో జరిగిన పరిణామాలకు బాధ్యత వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బీసీల సంక్షేమం విషయంలోనూ వైసీపీ పాలనపై ద్రోహమే జరిగింది. రూ.75 వేల కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించింది. 5 లక్షల అసైన్డ్ భూములను కబ్జా చేశారు.. అందులో అత్యధికం బీసీలవే. ఆ అన్యాయాలను ప్రశ్నించిన 300 బీసీ నాయకులను హత్య చేశారు. అంతకుముందు తెలుగుదేశం పార్టీ పాలనలో బీసీల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించిన 30 పథకాలను రద్దు చేసింది. ప్రొద్దుటూరులో నందం సుబ్బయ్య, పల్నాడులో తోట చంద్రయ్య, రేపల్లెలో అమర్నాథ్ గౌడ్ హత్య చేస్తే గొడ్డలి పార్టీ అధినేత జగన్‌రెడ్డి తొంగి చూసిన పాపాన పోలేదు. తెలుగుదేశం పార్టీ తన చరిత్రలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా రాజకీయ అవకాశాలను విస్తరించింది. కూటమి ప్రభుత్వం ఇప్పుడు చట్టపరమైన అడ్డంకులను అధిగమించేందుకు ప్రయత్నించడంతో పాటు, పార్టీపరంగా కూడా సీట్లు కేటాయిస్తామని ప్రకటిస్తోంది. ఈ రెండింటి మధ్య ఉన్న తేడాను బీసీలు గమనించాలి. బీసీలకు గతంలో జరిగిన నష్టాన్ని సరిదిద్దే చర్యలను వేగవంతం చేయడం, రిజర్వేషన్లకు అవసరమైన న్యాయపరమైన ఆధారాలను బలోపేతం చేయడం, ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం ద్వారానే కూటమి తన రాజకీయ నిబద్ధతను చాటుకుంటుంది.

### బీసీల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం అనేది ఒక ఎన్నికతో ముగిసిపోయే కార్యక్రమం కాదు. విద్య, ఉపాధి, వ్యాపారం, ఆర్థిక స్వావలంబన, సామాజిక గౌరవం వంటి రంగాల్లోనూ బీసీలు ఎదగాలి. స్థానిక సంస్థల్లో ఎన్నికైన బీసీ ప్రజాప్రతినిధులకు నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ, అభివృద్ధి కార్యక్రమాల్లో తగిన పాత్ర ఉండాలి. అప్పుడే రిజర్వేషన్లు నిజమైన సాధికారతకు దారితీస్తాయి. ఎన్టీఆర్ బీసీలకు రాజకీయ గుర్తింపు కల్పించే దిశగా వేసిన పునాదులను చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకెళ్లారు. బీసీలు రాజకీయంగా మరింత ఉన్నతస్థాయికి ఎదగాలి. బీసీలను ఓటు బ్యాంకుగా చూసే రాజకీయాలకు భిన్నంగా, వారిని పాలనలో భాగస్వాములుగా నిలబెట్టడమే తెలుగుదేశం పార్టీ ముందుంచుతున్న లక్ష్యం. రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక అభివృద్ధి.. ఈ మార్గాల్లోనూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకువచ్చి బీసీలకు మరింత భరోసా చేకూరుస్తుంది. బీసీల అభ్యున్నతికి టీడీపీ కట్టుబడి ఉందనే మాటకు నిజమైన బలం చేకూరుస్తుంది.



## బీసీల అభ్యున్నతికి కట్టుబడి ఉన్న కూటమి ప్రభుత్వం

**●బీసీలకు అన్యాయం చేసిన వైసీపీ.. కోర్టు కేసులతో రిజర్వేషన్లకు ఆటంకాలు : టీడీపీ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మండిపాటు**



పాతపట్నం (చైతన్యరథం): బీసీల సంక్షేమం, అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు, అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ సభ్యులు మామిడి గోవిందరావు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు జరిగిన అన్యాయంపై ఆయన విమర్శలు చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశం కోర్టు పరిధిలోకి వెళ్లడంతో బీసీల రాజకీయ ప్రాతినిధ్యంపై ప్రభావం పడిందని పేర్కొన్నారు. బీసీలకు సామాజిక న్యాయం కల్పించడం, విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో సముచిత అవకాశాలు అందించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో బీసీల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు.

## ఆధునిక క్రీడా సముదాయం నిర్మాణానికి ఎంపీ శ్రీ భరత్ శంకుస్థాపన

**●యువతకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా వసతులు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని వెల్లడి**



విశాఖపట్నం (చైతన్యరథం): నగరంలో క్రీడా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంతోపాటు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించి, స్థానిక క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెదగంట్యాడలో ఆధునిక క్రీడా సముదాయాన్ని నిర్మించనున్నట్లు విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ తెలిపారు. పెదగంట్యాడలో విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) ఆధ్వర్యంలో రూ.9.09 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న స్పోర్ట్స్ ఫెసిలిటీ పనులకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఎంపీ శ్రీభరత్ శంకుస్థాపన చేశారు. మొత్తం ఆరు ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్న ఈ క్రీడా ప్రాంగణంలో వివిధ క్రీడలకు అవసరమైన ఆధునిక వసతులను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా 120 మీటర్ల వ్యాసార్థంతో ప్రధాన క్రికెట్ మైదానం, రెండు ప్రాక్టీస్ పిచ్‌లు, రెండు బాస్కెట్‌బాల్ కోర్టులు, స్కేటింగ్ రింక్, టెన్నిస్ కోర్టు, వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేయనున్నారు. వీటితోపాటు ప్రజలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకునేందుకు ఓపెన్ జిమ్, క్రికెట్ మైదానం చుట్టూ 484 మీటర్ల పొడవు, మూడు మీటర్ల వెడల్పుతో జాగింగ్ ట్రాక్‌ను నిర్మించనున్నారు.

క్రీడా పోటీలను వీక్షించేందుకు ప్రేక్షకుల గ్యాలరీ, పరిపాలనా భవనం, సుందరమైన ల్యాండ్‌స్కేపింగ్, విశ్రాంతి తీసుకునేందుకు గెజిబో, పెర్గోలా, కూర్చునే సదుపాయాలు, మూడు వైపులా పార్కింగ్ వసతులను కూడా ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేయనున్నారు. ఈ క్రీడా సముదాయం అందుబాటులోకి వస్తే పెదగంట్యాడతోపాటు పరిసర ప్రాంతాల యువతకు, ఔత్సాహిక క్రీడాకారులకు వివిధ క్రీడల్లో సాధన చేసేందుకు మెరుగైన వేదిక లభిస్తుందని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆరోగ్య స్పృహ, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా, ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు దోహదపడతాయని తెలిపారు.

## రైతుల సౌకర్యాలే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యం!

**● నందిగామలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో నూతన క్యాష్ కౌంటర్‌ను ప్రారంభించిన టీడీపీ నేతలు**

నందిగామ (చైతన్యరథం): రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. నందిగామ మండలం ఐతవరం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సొసైటీలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాష్ కౌంటర్‌ను ఉమ్మడి కృష్ణాజిల్లా కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం, మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీలో రైతులకు అందుతున్న సేవలు, నగదు లావాదేవీల నిర్వహణ, సహకార బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా రైతులకు కలుగుతున్న ప్రయోజనాలపై నాయకులు చర్చించారు. నూతన క్యాష్ కౌంటర్ అందుబాటులోకి రావడంతో రైతులు, ఖాతాదారులకు లావాదేవీల నిర్వహణ మరింత సులభతరం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లో సహకార సంఘాల సేవలను మెరుగుపరచడం ద్వారా రైతులకు స్థానికంగానే అవసరమైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుంది.

## బీసీల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



ఎల్.కోట (చైతన్యరథం): వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమం, రాజకీయ, సామాజిక హక్కుల పరిరక్షణే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని శృంగవరపుకోట శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి స్పష్టం చేశారు. ఎల్.కోట మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎస్.కోట నియోజకవర్గ పరిధిలోని ముఖ్య బీసీ నాయకులతో ఆమె ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు వెలువరించిన తాజా తీర్పు, దాని పర్యవసానాలు, భవిష్యత్తులో బీసీల ప్రాతినిధ్యం తగ్గకుండా అనుసరించాల్సిన కార్యాచరణ, న్యాయపరమైన, రాజకీయ వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు తమ అభిప్రాయాలను, సూచనలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీలకు వెన్నెముకగా నిలిచిందని, రాబోయే రోజుల్లో కూడా బీసీ వర్గాల ప్రయోజనాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. బీసీ నాయకులంతా క్షేత్రస్థాయిలో ఐక్యంగా ఉంటూ సమాజ వికాసానికి కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## దేశమంతా బుర్రిపాలెం గురించే మాట్లాడుకుంటున్నారు : ఎంపీ పెమ్మసాని



తెనాలి (చైతన్యరథం): దేశంలో తొలిసారిగా 100 త్రీడీ గృహాలు నిర్మించనున్న గ్రామంగా బుర్రిపాలెం చరిత్ర సృష్టించిందని, ఇప్పుడు దేశమంతా మన గ్రామం గురించే మాట్లాడుకుంటున్నారని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని రికార్డులు నమోదు అవుతాయని పేర్కొన్నారు. శనివారం ఆయన గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో పర్యటించి, స్థానిక కల్యాణ మండపంలో గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పర్యటనను విజయవంతం చేసినందుకు గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తైన తర్వాత ప్రధాని మోదీని ఆహ్వానించేందుకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బుర్రిపాలెం, చక్రాయపాలెం గ్రామస్థులు పాల్గొన్నారు.

## నేటి నుంచి విజయవాడ ఉత్సవ్-2.0 ప్రారంభం : ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలతో పాటు విజయవాడ ఉత్సవ్ సీజన్-2.0ను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. నేడు సాయంత్రం ప్రారంభమయ్యే విజయవాడ ఉత్సవ్-2.0 కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాలను ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షలకు అనుగుణంగా ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, స్థానిక చిరు వ్యాపారులకు ఆర్థికంగా మేలు జరిగేలా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పడమే విజయవాడ ఉత్సవ్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**స్థానిక కళాకారులకు ప్రత్యేక ప్రాధాన్యం**

విజయవాడ ఉత్సవ్‌లో గతంలో కంటే భిన్నమైన సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీ తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో భాగంగా సుమారు 45 నిమిషాల పాటు స్థానిక కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పిస్తామని చెప్పారు. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు నిర్వహించిన అనంతరం అతిథులు సభా వేదికపైకి చేరుకుంటారని వివరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, స్థానిక కళాకారులను ప్రోత్సహించే ప్రదర్శనలు, ప్రతిభావంతులను వెలికితీసే పోటీలు ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు.

**దసరా ఉత్సవాలు, సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్‌ను విజయవంతం చేయాలి**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, జాతీయ సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్--2.0.. ఈ మూడు కార్యక్రమాలను ప్రజలంతా భాగస్వాములై విజయవంతం చేయాలని ఎంపీ కేశినేని చిన్ని పిలుపునిచ్చారు. ఈ నెల 14న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కనకదుర్గమ్మను దర్శించుకోనున్నారని, 15న జాతీయ సరస్ మేళాను ప్రారంభించనున్నారని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ మేళాలో పాల్గొని తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నారని చెప్పారు.

**వ్యాపారులు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాలి**

విజయవాడకు లక్షలాది మంది భక్తులు, సందర్శకులు వచ్చే అవకాశం ఉన్నందున నగర ప్రజలు, వ్యాపారులు ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని ఎంపీ కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, వాణిజ్య సముదాయాలను అందంగా అలంకరించాలని సూచించారు. వాణిజ్య సంస్థలు సొంత లైటింగ్‌తో భవనాలను అలంకరించడం ఈసారి ప్రత్యేకతగా నిలుస్తోందని తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్లిం మైనారిటీలకు 10 స్థానాలు కేటాయించాలి



విశాఖపట్నం (చైతన్యరథం): రాబోయే విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్లిం మైనారిటీ వర్గానికి కనీసం 10 స్థానాలు (సీట్లు) కేటాయించాలని తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనారిటీ విభాగం నాయకులు విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరామ్ ప్రధాన కార్యదర్శి లొడగల కృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనారిటీల ముఖ్య సలహాదారు, శాసనమండలి మాజీ ఛైర్మన్, విశాఖ జిల్లా ఎన్నికల ఇన్‌ఛార్జ్ మహమ్మద్ అహ్మద్ (ఎం.ఎ.) షరీఫ్‌ని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షకులు మరియు ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన షరీఫ్‌కి ఈ సందర్భంగా నాయకులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ ఆవిర్భావం నుండి ముస్లిం మైనారిటీలు తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ పటిష్టతకు అంకితభావంతో కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లా రాజకీయాల్లో, ప్రజాసేవలో చురుగ్గా పాల్గొంటున్న మైనారిటీ నాయకులు, కార్యకర్తల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకొని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం 10 స్థానాలను కేటాయించి ప్రజాప్రతినిధుల సభల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. తద్వారా శ్రేణుల్లో నూతనోత్సాహం నింపడమే కాకుండా ఎన్నికల్లో పార్టీ విజయానికి బలమైన తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు.

# యువత నైపుణ్యాభివృద్ధికి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ దోహదం

- వెస్ట్ ఇబ్రహీంపట్నంలో రూ.25 లక్షలతో భవన నిర్మాణానికి శంకుస్థాపన
- నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలి
- మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు



కొండపల్లి (చైతన్యరథం): యువతలో నైపుణ్యాలను పెంపొందించి, వారి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఎంతగానో దోహదపడతాయని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వెస్ట్ ఇబ్రహీంపట్నంలో డి.ఎం.ఎఫ్ నిధులు రూ.25 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ భవన నిర్మాణానికి ఆయన శనివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ... యువతకు అవసరమైన నైపుణ్యాలను అందించడంతోపాటు, వారి సామర్థ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి కేంద్రాలు ఉపయోగపడతాయని అన్నారు. స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన అవకాశాలు అందుబాటులోకి రావడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు వివరించారు. ప్రజల అవసరాలను గుర్తించి, ముఖ్యంగా పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, యువతకు అభివృద్ధి అవకాశాలను కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల ఆర్థిక, సామాజిక వికాసానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

# మహిళా సాధికారతే కూటమి ప్రభుత్వ ధ్యేయం: దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని

- స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంక్ లింకేజ్ రుణాల పురోగతిపై అధికారులతో ఎమ్మెల్యే సమగ్ర చర్చ



దుగ్గిరాల (చైతన్యరథం): గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక ప్రగతి, స్త్రీ సాధికారత సాధనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రుణాల పంపిణీపై దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ శనివారం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (DRDA) ప్రాజెక్ట్ డైరెక్టర్, దెందులూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి విజయలక్ష్మితో పాటు డీఆర్డీఏ, వెలుగు సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు అందుతున్న స్త్రీనిధి, ఉన్నతి, మరియు బ్యాంక్ లింకేజ్ రుణాల మంజూరు, రికవరీ పురోగతిపై ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ క్షుణ్ణంగా సమీక్షించారు. అర్హులైన ప్రతి నిరుపేద మహిళకు ఆర్థిక తోడ్పాటు అందించి, వారు స్వయం ఉపాధి పొందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మహిళా రైతులకు వరం.. 4 మండలాల్లో సీహెచ్‌సీ కేంద్రాలు: దెందులూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో విస్తరించి ఉన్న 'ఉమెన్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్' (మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు) సభ్యుల వ్యవసాయ అవసరాలు తీర్చేందుకు కస్టమైజ్డ్ హైరింగ్ సెంటర్లను (జబజ) ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రకటించారు. ఈ కేంద్రాల ద్వారా అత్యాధునిక వ్యవసాయ యంత్రాలు, పనిముట్లను రాయితీపై అద్దెకు తీసుకునే వెసులుబాటు మహిళా రైతులకు లభిస్తుందన్నారు. ఈ కేంద్రాల ఏర్పాటు నిమిత్తం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో తగిన ప్రభుత్వ స్థలాలను కేటాయిస్తున్నట్లు ఆయన తెలిపారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ...**

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే కుటుంబాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతాయని కూటమి ప్రభుత్వం ప్రగాఢంగా విశ్వసిస్తోందన్నారు. మహిళా రైతులు ఆధునిక సాగు పద్ధతుల్లో లాభాలు ఆర్జించేలా కస్టమైజ్డ్ హైరింగ్ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. మహిళల సంక్షేమం, భద్రత, సామాజిక సాధికారతకు తమ ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు.

# సుమారు రూ.2 కోట్లతో ప్రాథమిక ఆసుపత్రి : మంత్రి కొలుసు పార్థసారథి



ఏలూరు (చైతన్యరథం): చాట్రాయి మండలంలోని పలుగ్రామాలలో రూ 12.05 కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రైనేజ్, త్రాగునీటి వంటి మౌలిక సదుపాయాలు నిర్మాణాలను రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. నూజివీడు నియోజకవర్గం లోని రోడ్లు, త్రాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. మంత్రి ప్రత్యేక చొరవతో చాట్రాయి మండలంలోని పలు గ్రామాలలో దశాబ్దాలు రోడ్లు, త్రాగునీటి, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించింది.

**గ్రామాలు వారీగా మంజూరైన పనులు.**

1. సూరవరం గ్రామ అభివృద్ధి మెయిన్ రోడ్డు నుండి గౌడ బజారు వరకూ సీసీ రోడ్డు 264 మీటర్లు అంచనా వ్యయం రూ 24 లక్షలు. త్రాగునీటి మోటారు రూ 26 వేలు.
2. చనుబండ గ్రామ అభివృద్ధి కాపులవీధి సీసీ రోడ్డు - 183 మీటర్లురూ 10 లక్షలు, త్రాగునీటి పైపులైను -రూ. 2 లక్షలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం - రూ 1.93 కోట్లు.
3. పోతన గ్రామ అభివృద్ధి సీసీ రోడ్డు - 1.7 కిలోమీటర్లు - రూ. 3 కోట్లతో శరవేగంగా నిర్మాణాలు జరుగుచున్నాయి.

గ్రామస్తుల హర్షం - మంత్రికి కృతజ్ఞతలు తమ గ్రామాలలో కోట్లాది రూపాయలతో రోడ్లతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న కూటమి ప్రభుత్వానికి, మంత్రి కొలుసు పార్థసారథికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గత 20 సంవత్సరాలుగా లేని రోడ్లు, త్రాగునీటి మోటారును మంత్రి మా గ్రామానికి వచ్చినప్పుడు సమస్యను తెలియజేయగా త్వరలో పరిష్కరిస్తానని మాట ఇచ్చి, మాట నిలబెట్టుకున్నారని ధన్యవాదాలు తెలిపారు.

**చనుబండ గ్రామానికి చెందిన సీహెచ్. సావిత్రి మాట్లాడుతూ...** గతంలో మా వీధిలో సరైన రోడ్లు లేక రాకపోకలకు ఎంతో ఇబ్బందులు పడ్డామని, త్రాగునీరు లేక ఇబ్బంది పడ్డామని, మంత్రికి విన్నవించు కున్న కొద్ది రోజులకే రోడ్డు మంజూరు చేసి త్రాగునీరు అందించిన మంత్రికి జీవితాంతం రుణపడి ఉంటామని, ఇలాంటి ఎమ్మెల్యేను మునుపెన్నడూ చూడలేదని, ఇలాంటి ఎమ్మెల్యే పది కాలాలు పాటు ఉండాలని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు టీడీపీ కట్టుబడి ఉంది

- స్థానిక సంస్థల్లో బీసీలకు న్యాయం జరిగేలా పార్టీ పరంగా రిజర్వేషన్లు
- బీసీలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత టీడీపీదే
- బీసీ సమావేశంలో శాసనసభ్యులు వనమాడి కొండబాబు



కాకినాడ (చైతన్యరథం): బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించి, వారికి రాజకీయంగా సముచిత ప్రాధాన్యం కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు స్పష్టం చేశారు. కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు శనివారం కాకినాడ సిటీ నియోజకవర్గ బీసీ నాయకులతో సమావేశం నిర్వహించి అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ... చట్టపరమైన పరిమితుల కారణంగా రిజర్వేషన్ల అమలులో ఇబ్బందులు ఎదురైనా, బీసీలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ పరంగా 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సంసిద్ధంగా ఉన్నారని, బీసీలకు దక్కాల్సిన రాజకీయ ప్రాతినిధ్యాన్ని గత వైసీపీ ప్రభుత్వంశీ తగ్గించిందని, 2019 ఎన్నికలకు ముందు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి పోటీకి అవకాశం ఇచ్చిందని, అనంతరం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందని, ఈ నిర్ణయం కారణంగా బీసీలు 16 వేలకు పైగా రాజకీయ పదవులను కోల్పోయారని పేర్కొన్నారు. బీసీలు కోల్పోయిన రాజకీయ ప్రాతినిధ్యాన్ని తిరిగి సాధించాలనే ఉద్దేశంతోనే తెలుగుదేశం పార్టీ 34 శాతం రిజర్వేషన్ల కోసం నిరంతరం ప్రయత్నిస్తోందని, చట్టపరమైన పోరాటంతో పాటు పార్టీ పరంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై అసెంబ్లీలో బిల్లు ఆమోదించడం నుంచి న్యాయపరమైన పోరాటం వరకు తెలుగుదేశం పార్టీ ప్రయత్నించిందని, హైకోర్టులో ఎదురైన అడ్డంకుల అనంతరం సుప్రీంకోర్టులోనూ ప్రయత్నాలు చేసినట్లు పేర్కొన్నారు. న్యాయవ్యవస్థకు రాజ్యాంగపరమైన పరిధులు, పరిమితులు ఉంటాయని, వాటి కారణంగా చట్టపరంగా ఆశించిన ఫలితం సాధ్యం కాని పరిస్థితుల్లోనూ బీసీలకు న్యాయం చేయాలన్న సంకల్పంతో పార్టీ ముందుకు వెళ్తుందని, తెలుగుదేశం పార్టీకి, బీసీలకు విడదీయలేని అనుబంధం ఉందని ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించిన తర్వాత బీసీలకు రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం లభించిందని, నందమూరి తారక రామారావు, చంద్రబాబునాయుడు నాయకత్వంలో బీసీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం పెరిగిందని కొండబాబు పేర్కొన్నారు.

# బీసీలకు 34% రిజర్వేషన్ల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే కొలికపూడి



తిరువూరు (చైతన్యరథం): తిరువూరు నియోజకవర్గంలో బీసీలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్ల కల్పన అంశంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి బీసీ సమావేశాన్ని శాసనసభ్యులు వారి కార్యాలయం నందు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముందు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బీసీ నాయకులు, పార్టీ శ్రేణులతో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించి, బీసీల రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ... బీసీల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం కోసం తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు బీసీలకు అండగా నిలుస్తూ, వారి అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు కల్పించడం ద్వారా గ్రామస్థాయి నుంచి నాయకత్వాన్ని బలోపేతం చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. బీసీ అంటే బి - బాబు, సి - కమిట్మెంట్" అంటూ కొత్త అర్థాన్ని వివరించారు. బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చూపిస్తున్న నిబద్ధతకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

చైతన్యరథం

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలు సామాజిక న్యాయానికి నిదర్శనం

**●ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి అభినందనలు తెలిపిన పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బుద్దా వెంకన్న**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ గాంధీ నగర్ శ్రీ రామ ఫంక్షన్ హాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి అభినందనలు తెలియజేస్తూ, పాలాభిషేకం నిర్వహించి అనంతరం విస్తృత స్థాయి సమావేశంలో జాతీయ పార్టీ ఉపాధ్యక్షులు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బుద్దా వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ... "స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలు చేయాలనే నిర్ణయం బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి ఎంతో కీలకమైన అంశం. సమాజంలో వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాన్ని మేము స్వాగతిస్తున్నాం. బీసీల అభ్యున్నతి, ఆత్మగౌరవం, రాజకీయ సాధికారతకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రాధాన్యతనిస్తూ వచ్చింది. బీసీలకు సముచితమైన అవకాశాలు కల్పించడం ద్వారా వారు స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ఎదిగి, తమ ప్రాంతాల అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి మార్గం సుగమం అవుతుంది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి మా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాం. బీసీల సంక్షేమం, అభివృద్ధికి రాజకీయంగా తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. బీసీలకు న్యాయం జరిగేలా, అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయ అవకాశాల గురించి అవగాహన కల్పించేలా కృషి చేయాలి" అని బుద్దా వెంకన్న పేర్కొన్నారు.

## బీసీలకు 34% రిజర్వేషన్‌ను అడ్డుకున్న జగన్‌మోహన్‌రెడ్డికి బీసీల సత్తా చూపిస్తాం

**●అంకెం ఇందిరా ప్రియదర్శిని, రాష్ట్ర కార్యదర్శి, తెలుగుదేశం పార్టీ , డైరెక్టర్, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్**



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు జిల్లా జి.కొండూరు మండల కేంద్రంలో నేడు రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అంకెం ఇందిరా ప్రియదర్శిని మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రిజర్వేషన్ అమలు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తీవ్రంగా కృషి చేశారని, ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు కొట్టివేసినా సుప్రీంకోర్టులోనూ పోరాడారని ఆమె తెలిపారు. గతంలో అధికారంలో ఉన్న జగన్‌మోహన్ రెడ్డి బీసీలను అణగదొక్కడానికి శతవిధాలా ప్రయత్నించారని, బీసీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం, హత్యలు చేయడం జరిగిందని ఆమె ఆరోపించారు. ప్రొద్దుటూరులో నందం సుబ్బయ్య, పల్నాడు జిల్లాలో తోట చంద్రయ్య, అమర్నాథ్ గౌడ్ వంటి సంఘటనలను గుర్తు చేస్తూ, జగన్ పాలనలో బీసీలపై జరిగిన అన్యాయాలను వివరించారు. బీసీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించడం, 55 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు, విధులు లేకుండా అవమానించడం జరిగిందని ఆమె విమర్శించారు.

## గన్నవరంలో రూ.11.85 కోట్లతో 33 రహదారుల నిర్మాణం

గన్నవరం (చైతన్యరథం): నియోజకవర్గంలో రూ.11.85 కోట్ల అంచనా వ్యయంతో 33 రహదారుల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. సాస్కి, పల్లె పండుగ 3.0 పథకాల కింద చేపట్టనున్న ఈ పనులకు శనివారం విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని సాయిబాబా మందిరం వద్ద ఆయన శంకుస్థాపన చేశారు. ఎన్నికల ప్రకటన వెలువడిన తర్వాత పనులకు ఆటంకం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో మంజూరైన నిధులతో రహదారుల నిర్మాణానికి ముందుగానే శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నున్న గ్రామానికే పరిమితం కాదని, గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలతోపాటు విజయవాడ రూరల్ ప్రాంతంలోని పలు గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. సాస్కి నిధులు రూ.7.85 కోట్లతో ఐదు రహదారులను 15.453 కి.మీ. మేర నిర్మించనున్నారు. ముస్తాబాద--నున్న రహదారిని 4.994 కి.మీ. మేర రూ.2.75 కోట్లతో, జక్కులనెక్కలం మీదుగా కేసరపల్లి--ముస్తాబాద రహదారికి అనుసంధాన మార్గాన్ని 2.762 కి.మీ. మేర రూ.1.26 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. చిక్కవరం--పురుషోత్తపట్నం రహదారి నుంచి గోపవరపుగూడెం ఎస్సీ కాలనీ, కట్టుబడిపాలెం మార్గాల నిర్మాణానికి రూ.72 లక్షలు కేటాయించారు. తెంపల్లి నుంచి బల్లిపర్రు మీదుగా గన్నవరం మండల సరిహద్దు వరకు, బల్లిపర్రు నుంచి పోలవరం కాలువ వరకు రహదారుల నిర్మాణానికి రూ.96 లక్షలు వెచ్చించనున్నారు. తిప్పనగుంట--కానుమోలు రహదారిని 4.573 కి.మీ. మేర రూ.2.52 కోట్లతో నిర్మించనున్నారు.

## బీసీలకు34% రిజర్వేషన్ ఇవ్వకుండా అడ్డుకున్న జగన్

**● వినుకొండ పట్టణంలో రూ.281 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**



వినుకొండ (చైతన్యరథం): బీసీలకు 34% శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేస్తే వైసిపి నేత జగన్మోహన్ రెడ్డి సైంధవుడిలా కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆరోపించారు. వినుకొండ పట్టణం తిమ్మాయిపాలెం రోడ్డు సబ్ స్టేషన్ వద్ద 1.10కోట్లతో ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్ఫార్మర్, 23వ వార్డు డబ్బా స్తంభం సెంటర్ వద్ద 10 లక్షలతో ఏర్పాటుచేసిన ట్రాన్స్ఫార్మర్, రెడ్డినగర్‌లో 9.50 లక్షలతో ఏర్పాటు చేసిన మరో ట్రాన్స్ఫార్మర్, నరసరావుపేట రోడ్డులో 90 లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డు, డ్రైనేజీలను ఆయన ప్రారంభించారు. అలాగే కారంపూడి రోడ్డు హోండా షోరూం వద్ద 10 లక్షలతో, కరెంట్ ఆఫీస్ వద్ద 20 లక్షలు, నాలుగో వార్డ్ రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద 20 లక్షలతో సిసి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ పట్ల సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తామని, ఎన్డీఏ నుండి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్ ఇచ్చి వారికి అండగా నిలుస్తామని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. బీసీలకు రిజర్వేషన్ ఇవ్వకుండా సైంధవుడిలా జగన్ అడ్డుపడ్డాడని ఆయన మండిపడ్డారు. వైసీపీ పాలనలో బీసీ కార్పొరేషన్ 70 వేల కోట్లు నిధులు తప్పుదోవ పట్టించి జగన్మోహన్ రెడ్డి బీసీలకు ద్రోహం చేశాడని విమర్శించారు. 34% ఉన్న రిజర్వేషన్ను వైసిపి 24% తగ్గించడం వల్ల బీసీలు రాజకీయ పదవుల్లో 16,800 కోల్పోయారని, బీసీలకు అన్యాయం చేసిన వైసీపీని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.

**నాణ్యమైన విద్యుత్ సరఫరాకు 6వేల కోట్లు ఖర్చు చేస్తున్న కూటమి ప్రభుత్వం..**

లో వోల్టేజ్ ని అధిగమించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని, అందుకు 6 వేల కోట్లు ఖర్చు చేస్తుందని చీఫ్ విప్ జీవి తెలిపారు. సబ్ స్టేషన్లో, పవర్ స్టేషన్లో, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటుచేసి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్తును అందిస్తుందన్నారు. వినుకొండలో 1899 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ప్రభుత్వం 22.75 కోట్లు ఇప్పటికే ఖర్చు చేయడం జరిగిందన్నారు.

**విష ప్రచారాలు మాని అభివృద్ధిని ప్రోత్సహించు బొల్లా..**

వినుకొండలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేస్తున్న విష ప్రచారాన్ని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తీవ్రంగా ఖండించారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో 53 కోట్లు ఖర్చు చేస్తే, రెండున్నర ఏళ్ల కూటమిపాలనలో తాము 281.53 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని జీవి ఆంజనేయులు స్పష్టం చేశారు.

## బీసీ రిజర్వేషన్ల అడ్డుకున్న గొడ్డలిపార్టీ...రాజకీయ ప్రస్థానం ముగింపు ఖాయం

**●నియోజకవర్గ బీసీ విస్తృతస్థాయి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**



చిలకలూరిపేట (చైతన్యరథం): బలహీన వర్గాల రాజకీయ, సామాజిక, ఆర్థిక ఎదుగుదలకు అతిపెద్ద అడ్డంకి, అవరోధం జగన్.. వైసీపీయేనని, బీసీల్లో చైతన్యం.. ప్రశ్నించేతత్వం పెరిగినప్పుడే గొడ్డలిపార్టీ రాజకీయ ప్రస్థానం ముగుస్తుందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గ బి.సి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో మద్దిబోయిన శివ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి బీసీల సమీక్ష సమావేశంలో ప్రత్తిపాటి మాట్లాడారు. టీడీపీ అధిష్టానం పార్టీ పరంగా అమలుచేయనున్న 34శాతం బీసీ రిజర్వేషన్లను స్వాగతిస్తూ.. ప్రత్తిపాటి, నియోజకవర్గ బీసీ నేతలకు స్వయంగా స్వీట్లు తినిపించారు. అనంతరం ఆయన వారిని ఉద్దేశించి మాట్లాడారు.

**34 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్లు ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి ఆలోచన**

చంద్రబాబు ప్రకటించిన బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవడమే లక్ష్యంగా జగన్ చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశాడని, న్యాయస్థానాల్ని ఆశ్రయించి మరీ బలహీనవర్గాల రాజకీయ ఎదుగుదలను అడ్డుకున్నాడని ప్రత్తిపాటి ఆక్షేపించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు, ఆపార్టీకే అండగా నిలుస్తున్నారన్న భావన జగన్ మనసులో నాటుకుపోయిందని, ఆ దురుద్దేశంతోనే బలహీన వర్గాల్ని అన్ని విధాలా అణచివేస్తున్నాడన్నారు. 2019–24 మధ్య రాజ్యాంగబద్ధంగా బీసీలకు దక్కాల్సిన 16,800కు పైగా స్థానిక సంస్థల పదవుల్ని జగన్ వారికి దూరం చేశాడని ప్రత్తిపాటి తెలిపారు.

**40 రోజుల ఎన్నికల దీక్షలో.. విజయమే మన లక్ష్యం.**

అన్నికాలాలుగా బీసీల్ని బలోపేతం చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, బలహీన వర్గాల్ని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్న నమ్మకం టీడీపీ అధినేతకు ఉందని ప్రత్తిపాటి చెప్పారు. 34 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్లు ప్రకటించాలన్నఆలోచనలో చంద్రబాబు ఉన్నారని, నేడో, రేపో ఆ ప్రకటన కూడా వెలువడే అవకాశముందన్నారు. 14న ఎన్నికల షెడ్యూల్, 15న నోటిఫికేషన్ వెలువడే అవకాశముందన్న ప్రత్తిపాటి. పట్టణంలోని అన్ని వార్డుల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించాలని, ఆ దిశగా మూడుపార్టీల శ్రేణులు క్షేత్రస్థాయి నుంచే పనిచేయాలన్నారు. మున్సిపాలిటీలతో పాటు.. పంచాయతీలు, మండలాలు, జడ్పీటీసీల్లోనూ కూటమి విజయ పరంపర కొనసాగాలని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

## రూ.2.77 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గంలోని 25,29వ డివిజన్లలో రూ.2.77 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి శనివారం శంకుస్థాపన చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. 25వ డివిజన్ ఆదర్శ్ నగర్‌లో పర్యటించిన సమయంలో సుమారు 40 రోజుల క్రితం స్థానిక మహిళలు రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించి, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే నిధులు మంజూరు చేయించి, పనులు ప్రారంభించడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పనులతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు, మురుగునీటి పారుదలకు సంబంధించిన సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.. ప్రజలు కోరుకునే మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఆదర్శ్ నగర్‌లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై మహిళలు తనను కలిసి విజ్ఞప్తి చేసిన వెంటనే స్పందించి, 40 రోజుల్లోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ పనుల మంజూరు, ప్రారంభానికి సహకరించిన నగరపాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్, ఏఈలు, ఇంజినీరింగ్ విభాగం అధికారులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి కృతజ్ఞతలు తెలిపారు.

# కావలిని హరిత వనంగా మారుద్దాం

## కావలి శాసనసభ్యుడు కావ్య కృష్ణారెడ్డి



కావలి (చైతన్యరథం): ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ప్రతి ఒక్కరికీ అవసరమని కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం కావలి పట్టణంలోని దొడ్ల మనోహర్ రెడ్డి కల్యాణ మండపంలో కాంత్ ఫౌండేషన్ చైర్మన్ కుందా చంద్రకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ, నేటి ఆధునిక కాలంలో ఆహార అలవాట్లు, సరైన జీవన విధానం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. సమాజంలో ఆరోగ్య చైతన్యం నింపేందుకు కాంత్ ఫౌండేషన్ ప్రసాద్ చేపట్టిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కావలిలో 30 వేల మొక్కల నాటే బృహత్తర ప్రణాళిక..ఈ వేదికగా కావలి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఒక శుభవార్తను అందించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు కావలి పట్టణాన్ని పచ్చదనంతో నింపేందుకు ఒక గొప్ప సంకల్పాన్ని ప్రకటించారు. కావలి నియోజకవర్గం ముఖ్యంగా కావలి పట్టణ పరిధిలో 30,000 వేలు కంటే ఎక్కువ మొక్కలను నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ఈ బృహత్తర పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ”మన ఆరోగ్యం మనం తినే ఆహారంపై ఎంత ఆధారపడి ఉందో, మనం పీల్చే గాలి చుట్టూ ఉండే పర్యావరణంపై కూడా అంతే ఆధారపడి ఉందన్నారు. కావలిని సుందరమైన, ఆరోగ్యకరమైన, హరిత పట్టణంగా తీర్చిదిద్దడమే మన అందరి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంత్ ఫౌండేషన్ ప్రతినిధులు, రోటరీ క్లబ్ సభ్యులు, స్థానిక నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు మరియు కావలి పట్టణ ప్రజలు విశేషంగా పాల్గొన్నారు.




# సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్

యర్రగొండపాలెం (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అర్జీల రూపంలో అర్జీదారుల నుండి తీసుకున్నారు. ప్రతి సమస్యను త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యర్రగొండపాలెం మండల అధ్యక్షులు చిట్యాల వెంగళ రెడ్డి, పుల్లల చెరువు మండల అధ్యక్షులు పోట్ల గోవిందు, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు



నెల్లూరు (చైతన్యరథం): రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల చదువులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుందని ఏపీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ హర్షం వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం కింద ఫిర్యాదులను పరిష్కరించి రెండో విడతలో 3,29,201 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. 2026–27 విద్యా సంవత్సరానికి పథకం మొత్తం నిధులను రూ.10,208.69 కోట్లకు పెంచడం విద్యారంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనమన్నారు. అర్హులైన విద్యార్థులందరికీ ఆర్థిక సాయం అందించాలనే ప్రభుత్వ సంకల్పం పేద కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి చదువూ ఆగిపోకూడదనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఈ పథకం విద్యాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు అబ్దుల్ అజీజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మానవాళి సంక్షేమం కోసం సామూహిక నమాజ్

## ఏపీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్



నెల్లూరు (చైతన్యరథం): రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో శుక్రవారం నెల్లూరు నగరంలోని రంగనాయకుల పేట సమీపంలో పెన్నానది తీరాన ప్రత్యేక సామూహిక నమాజ్ నిర్వహించారు.

నమాజ్ లో ఏపీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పాల్గొని, సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రం సస్యశ్యామలంగా మారాలని అల్లాహ్‌ను ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో వంటి వాతావరణ పరిణామాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో ఒకవైపు వర్షాభావం, మరోవైపు ఆకస్మిక భారీ వర్షాలు, వరదలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వర్షాలు లేక పంటలు పండక రైతులు నష్టపోతుండగా, తాగునీటి కొరత ప్రజలను వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి సమతుల్యత దెబ్బతినడానికి పర్యావరణ కాలుష్యం, సహజ వనరుల విధ్వంసం వంటి మానవుని బాధ్యతారాహిత్య చర్యలు కూడా కారణమని, ప్రకృతి పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ ప్రార్థనలు మతాలకు అతీతంగా యావత్ మానవాళి సంక్షేమం కోసమని స్పష్టం చేశారు. ఏ రైతూ వర్షాలు లేక కన్నీరు పెట్టుకోకూడదని, ఏ కుటుంబమూ తాగునీటి కోసం అల్లాడకూడదని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలన్నదే ఈ ప్రార్థనల ఉద్దేశమన్నారు. ఈ పవిత్ర ప్రార్థనలో పాల్గొనడం సంతోషంగా ఉందని పేర్కొంటూ, ప్రత్యేక నమాజ్ ఏర్పాటు చేసిన మౌలానా ఇలియాస్‌కు అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

# జమ్మలమడుగులో టీడీపీ ప్రజాదర్బార్

జమ్మలమడుగు(చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భూపేష్ సుబ్బరామిరెడ్డి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించిన వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సంప్రదించి సమస్యల త్వరగా పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలపై కార్యాలయాలకు ప్రజలు వస్తే వాటిని వెంటనే పరిష్కరించి ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని తెలిపారు. అలాగే కార్యకర్తలు, నాయకులకు రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి కూటమి ప్రభుత్వ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలనీ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.





స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై పార్టీ నేతలతో చర్చిస్తున్న భూపేష్ సుబ్బరామిరెడ్డి

# సమగ్ర గ్రామీణాభివృద్ధి కూటమి ప్రభుత్వ ప్రధానలక్ష్యం

## కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి వెల్లడి



దగదర్తి (చైతన్యరథం): గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. మండల పరిధిలోని దామవరం పంచాయతీ నారాయణపురం గ్రామంలో 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో భాగంగా రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులను లాంఛనంగా ప్రారంభించారు. నారాయణపురం గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి తెదేపా ప్రముఖ నాయకుడు అశోక్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పల్లెల్లో రోడ్ల నిర్వహణను గాలికొదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో 'పల్లె పండుగ' ద్వారా ప్రతి గ్రామానికి అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు మంజూరు చేస్తూ పల్లెలకు మహర్దశ తెస్తున్నారని తెలిపారు. నారాయణపురంలో ప్రారంభించిన సీసీ రోడ్డు పనులను సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు ఎక్కడా రాజీ పడకుండా నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కావలి నియోజకవర్గంలోని ప్రతి పల్లెను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్డు సమస్యను గుర్తించి వెంటనే నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి తెదేపా నాయకుడు అశోక్ గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి మండల స్థాయి నాయకులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారులు మరియు భారీ సంఖ్యలో గ్రామ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసీపీని వీడి భారీగా టీడీపీలో చేరిన ముస్లిం మైనార్టీలు

## కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



కదిరి (చైతన్యరథం): కదిరి పట్టణంలో తెలుగుదేశం పార్టీతో కలిసి పనిచేసేందుకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు వస్తున్నారని, ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కదిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. కదిరి పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 23వ వార్డుకు చెందిన 30 ముస్లిం మైనార్టీ కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. కటిక షేక్ హస్నూ ఆధ్వర్యంలో ఆయన కుమారుడు సోహైల్‌తో పాటు మిచ్చేర్ సాదిక్, బాబ్జాన్, షేక్ మహమ్మద్ అలీ, మహాభాష, షేక్ బాబ్జాన్, రిక్షా సాదిక్ అలీ, అబిద్, వసీం, సాబు తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను స్వాగతిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ:"తెలుగుదేశం పార్టీలోకి వచ్చే ప్రతి ఒక్కరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు కల్పిస్తాం. పాత, కొత్త నాయకులు, కార్యకర్తలు అనే తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలి. కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన ప్రాధాన్యత ఉంటుంది. కదిరి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే మా ప్రధాన లక్ష్యం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పిలుపు

రాయదుర్గం (చైతన్యరథం): పట్టణంలోని బీటీపీ లే అవుట్‌లో అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన రక్షిత మంచినీటి పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాయదుర్గం పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా, ప్రజలకు వీలైనంత త్వరగా ప్రయోజనం చేకూరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు.

# స్థానిక ఎన్నికల్లో కూటమి గెలుపు ఖాయం

## ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ధీమా

పుట్టపర్తి (చైతన్యరథం): పుట్టపర్తి నియోజకవర్గంలో వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ గత పాలనలో జరిగిన అరాచకాలు, విధ్వంసకర విధానాల వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని, మళ్లీ ఆ పార్టీకి అవకాశం ఇస్తే ప్రజలకు మరింత ప్రమాదకరమని ఆమె పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. సుమారు రూ.31.77 కోట్లతో పుట్టపర్తి మండలంలో చేపట్టిన 35 పనులకు ఎమ్మెల్యే పల్లె సింధూర,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, గత వైసీపీ పాలనలో నెలకొన్న అనిశ్చితి, వేధింపుల వాతావరణంతో పుట్టపర్తి ప్రాంతంలోని బిల్డర్లు సైతం బెంగళూరుకు పారిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో నియోజకవర్గంలో స్వేచ్ఛాయుత వాతావరణం నెలకొందని, గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కూటమి ప్రజాప్రతినిధులు మండల కన్వీనర్ విజయకుమార్ , శ్రీరామ్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్ నాయక్, బొమ్మయ్య,నాగరాజు, మహేష్, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.





ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బీసీ రిజర్వేషన్ల ఖరారుపై నేతలతో సమావేశమైన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఖాయం : ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం (చైతన్యరథం): ఎవరు అడ్డుకున్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరుతామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం గారు చేశారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, బీసీలకు తెలుగుదేశం ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరిస్తూ.. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీలకు చేసిన ద్రోహాన్ని వివరించారు. బీసీలకు మొదటి నుంచి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న పార్టీ తెలుగుదేశం మాత్రమేనన్నారు. గతంలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యతను 20 శాతం నుంచి 34 శాతానికి పెంచిన ఘనత టీడీపీదేనన్నారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్, ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అనేక మంది బీసీ నేతలకు ఉన్నత పదవులు దక్కాయన్నారు. బీసీలకు మొదటి నుంచి ద్రోహం చేసింది వైసీపీనేనని.. కేవలం అధికారం తన వర్గానికే ఉండాలనేది జగన్ ఆలోచనన్నారు. గతంలో శంకర్ నారాయణ లాంటి వారు మంత్రిగా ఉన్నప్పటికీ, వారికి ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకుండా జగన్ రెడ్డి అణచివేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు రాకుండా హైకోర్టులో, ఆపై సుప్రీం కోర్టులో జగన్ మోకాలడ్డారని ఆరోపించారు. బీసీలు రాజకీయంగా ఎదగకూడదన్నదే జగన్ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వంలో బీసీ ఎమ్మెల్యేలు, మంత్రులకు కనీసం ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కూడా దక్కలేదన్నారు. జగన్ కేవలం ముగ్గురిని మాత్రమే దగ్గర పెట్టుకుని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను పూర్తిగా దూరం పెట్టారన్నారు. తమ ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి ఏకంగా రూ. 10,400 కోట్లు జమ చేశారన్నారు. రెండవ విడుత కూడా త్వరలోనే విడుదల చేస్తారన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించగా, ఇప్పటివరకు 10 కోట్ల ప్రయాణాలు విజయవంతంగా జరిగాయన్నారు. ఆటో డ్రైవర్ల సేవ, చేనేత కార్మికులకు విద్యుత్ సబ్సిడీ నేతన్న సేవ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. జగన్ గతంలో అన్న క్యాంటీన్లను మూసివేసి పైశాచిక ఆనందం పొందారని విమర్శలు చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక పేదల ఆకలి తీర్చడానికి 275 అన్న క్యాంటీన్లను మళ్లీ తెరిపించి.. 5రూపాయలకే 3పూటల భోజనం అందిస్తున్నామన్నారు.

గత రెండేళ్లుగా తనపై కుట్రలు, బురదజల్లే ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయని.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ ఉనికి కోసం కొందరు నిరుద్యోగ నాయకులు, వైఎస్ఆర్సీపీ నేతలతో చేతులు కలిపి నాపై కుట్రపూరితంగా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కర్నూలుకు చెందిన ఒక మహిళ వ్యక్తిగత స్థల వివాదాన్ని మంత్రి టి.జి. భరత్ నా దృష్టికి తీసుకురాగా, నేను తక్షణమే స్పందించి కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించాలని కోరానన్నారు. ఆమె ఆగస్టులో ఒక వ్యక్తికి స్థలం విక్రయించగా, సెప్టెంబర్ 29 నాటికి రిజిస్ట్రేషన్ కావాల్సి ఉందన్నారు. అయితే ఈ ప్రక్రియ కాస్త ఆలస్యం కావడంతో మా పార్టీలోని కొందరు కోవర్టులు ఆమెను రెచ్చగొట్టారన్నారు. సదరు మహిళను కర్నూలు నుండి అనంతపురం తీసుకొచ్చి.. ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేస్తే పని త్వరగా అవుతుందని పూర్తిగా స్క్రిప్ట్ ఇచ్చి మోటివేట్ చేశారన్నారు. దీని వెనుక మా పార్టీలోని కొందరు కోవర్టులతో పాటు వైసీపీ నాయకులు ఉన్నారని ఆయన ఆరోపించారు. ఈ వివాదానికి ఇప్పటికే పూర్తి పరిష్కారం లభించిందని..శుక్రవారమే ఆ మహిళకు సదరు స్థలం రిజిస్ట్రేషన్ కూడా చేయించారన్నారు. లీకైనట్లు చెప్తున్న ఆడియోలో ఎలాంటి అభ్యంతరకర విషయాలు లేవని పైగా నన్నిఏదో విషయంలో ఇరికించాలనే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. నా ఎదుగుదలను, నియోజకవర్గ అభివృద్ధిని ఓర్వలేకనే ఈ చిల్లర రాజకీయాలకు తెరలేపారని మండిపడ్డారు. ఈ మొత్తం విషయంపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని ఇందులో ఎవరున్నా చర్యలు తప్పవన్నారు. గత రెండేళ్లుగా నాపై బురద జల్లాలని చూస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సహా కొందరు రాజకీయ నిరుద్యోగులు ఇప్పటికైనా ఇలాంటివి మానుకోవాలన్నారు. రాజకీయంగా ఉనికి కోల్పోతూ, రాత్రి నిద్రలో కూడా నన్నే కలవరిస్తున్నారన్నారు. రుద్రంపేటలోని ఎస్సీల స్థల వివాదాన్ని, అలాగే వైసీపీకి చెందిన బీసీ వ్యక్తి మరియు మైనార్టీ మహిళకు సంబంధించిన అస్రా ఆసుపత్రి వివాదాన్ని కూడా నాకే ఆపాదించి దుష్ప్రచారం చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. నాకు దగ్గరగా ఉన్న వారిని ఏదో విధంగా దూరం చేస్తున్నారని.. అందులో భాగంగానే సుధాకర్ యాదవ్‌ను, అలాగే నా పక్కన ఉన్న వాళ్లను కావాలనే వివాదాల్లోకి లాగి నన్ను ఒంటరిని చేయాలని కుతంత్రాలు పన్నుతున్నారన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలకు నేను భయపడే ప్రసక్తే లేదన్నారు. నాకు ప్రజలతో పాటు పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ అండ ఉన్నంత వరకు ఏవరూ ఏమీ చేయలేరన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అనంతపురం కార్పొరేషన్ పరిధిలోని 62కి 62 స్థానాలను గెలుచుకుని తీరుతామని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల అంశంపై స్పష్టత వచ్చిన తర్వాత మేయర్ అభ్యర్థిపై స్పష్టత వస్తుందన్నారు. అధిష్టానం మేయర్ అభ్యర్థిగా ఒక సామాన్య కార్యకర్తకి ఇచ్చిన వారి గెలుపు కోసం పని చేస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు..



## మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం ఆదర్శం

- రాజధాని ప్రాంత

**ప్రవాస భారతీయుల శుభాకాంక్షలు**

**అమెరికా:** మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానంపై రాజధాని ప్రాంత ప్రవాస భారతీయులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అఖండ స్వాతంత్ర్య భారతదేశాన్ని 78 ఏళ్లుగా పరిపాలించిన ఎందరో పరిపాలనా దక్షులు, అభ్యుదయ వాదులు, సంస్కర్తలు ఉన్నారు. వారిలో 1950 గుజరాత్‌లో జన్మించి బాల్యంలో టీ స్టాల్‌లో సైతం పనిచేసి చిన్న వయసులోనే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లో చేరి సామాన్యునిగా జీవితం ఆరంభించి.. క్రమశిక్షణ, అంకితభావం పెట్టుబడిగా దశాబ్దాల పాటు ప్రజలతో మమేకమై 2001 నుంచి 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆపై 2014 నుంచి దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తు న్నారని ప్రశంసించారు. భారతదేశ దిశ, దశను మార్చిన ప్రధానిగా మోదీ ప్రజాశీస్సులతో నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వంటి ఆర్థిక విధానాలు, ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వంటి చట్టాల నిర్ణయాలు, స్వచ్ఛ భారత్ మిషన్,



ఆయుష్మాన్ భారత్, డిజిటల్ ఇండియా వంటి వంటి జాతీయ సంక్షేమ కార్య్రకమాలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. మోదీ జీవితం కోట్లాది మంది యువతకు ఆదర్శం. మొక్కవోని దీక్ష, నిరంతర శ్రమ, క్రమశిక్షణతో పాటు తరాలు మారుతు న్నా నూతన పాలన విధానాలను సమీక్షించుకుంటూ పొరుగు దేశాలతో ద్వైపాక్షిక ఆర్థిక, రక్షణ సంబంధాలను పటిష్టం చేశారు. ఒక సామాన్య వ్యక్తి జీవితంలో తపన, తపస్సుతో పోరాడితే ఆకాశమే హద్దు అని నిరూపించి కోట్లాది మందికి తన నిజ జీవిత విజయాలతో ఆదర్శంగా నిలిచారంటూ కొనియాడారు. ప్రవాస భారతీయులు, కూటమి పార్టీల ప్రతినిధుల తరపున మోదీ 25 ఏళ్ల ప్రజాప్రస్థానానికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఏడు రోజులు..తొమ్మిది కార్యక్రమాలు



- కూటమి ప్రభుత్వానికి అభినందనలు
- సెయింట్ లూయిస్‌లో కేక్ కట్ చేసిన ఎన్ఆర్ఐ టీడీపీ, ఏపీఎన్ఆర్‌టీ సభ్యులు
- చంద్రబాబు నాయకత్వానికి జేజేలు

**అమెరికా:** ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అభినందిస్తూ సెయింట్ లూయిస్‌లో ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యులు కేక్ కట్ చేసి కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు అభి నందనలు తెలిపారు. ఎన్ఆర్ఐ టీడీపీ గ్లోబల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెంచు వేణుగోపాల్‌రెడ్డి మాట్లా డుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కేవలం ఏడురోజుల వ్యవధిలో తొమ్మిది కీలక కార్యక్రమాలు చేపట్టడం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తోందని పేర్కొన్నారు. మేము విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ మన మాతృభూమిపై మమ కారం, మన రాష్ట్ర అభివృద్ధిపై బాధ్యత ఎప్పటికీ తగ్గవు. మన ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, గ్రామీణాభివృద్ధి, యువతకు మరిన్ని అవకాశాల కల్పన మా అందరి ఆకాంక్ష. ఆంధ్రప్రదేశ్ అభివృ ద్ధి చెందాలి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడాలి, మన రాష్ట్రం మరిన్ని అవకాశాలకు కేం ద్రంగా ఎదగాలి. సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృ ద్ధికి చేస్తున్న కృషికి ఎన్ఆర్ఐ టీడీపీ సెయింట్ లూయిస్ తరపున అభినందనలు తెలిపారు.



## 'క్యా హువా తేరా వాదా'

**కెనడా మేయర్ రేసులో ఉన్న తెలుగు మహిళ వినూత్న ప్రచారం**



**కెనడా:** తెలంగాణ సంతతికి చెందిన దీపికా దామెర్ల కెనడాలోని మిసిసాగా మేయర్ పదవికి పోటీ చేస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకోవడానికి దీపిక వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. హిందీ పాట 'క్యా హువా తేరా వాదా' స్టైల్‌లో ఓటర్లకు ఆమె హామీలు ఇస్తున్నారు. ఆ పాట తరహాలో పేరడీ చేస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ పాటను ఆమె తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. తనను మిసిసాగా మేయర్‌గా గెలిపిస్తే ఏమేం చేస్తానో వివరిస్తూ పలు హామీలు ఇచ్చారు. "మిసిసాగా మేయర్ పదవికి పోటీ చేస్తున్న నన్ను గెలిపించండి. నేను మేయర్‌గా ఎన్నికైతే ప్రాపర్టీ ట్యాక్స్ పెంచను. ఆ పన్ను పెరగకుండా చూస్తాను. దయచేసి నాకు మద్దతు తెలిపి మేయర్‌గా గెలిపించండి. మిసిసాగా పనిచేసే నగరం" అని ఆ పోస్టులో దీపిక ట్వీట్ చేశారు. కాగా ఒరిజినల్ హిందీ పాటలో పదాలను మార్చిన ఆమె.. అదే ట్యూన్‌లో పాడుతూ ఓటర్లకు హామీలు ఇచ్చారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

**ఎవరీ దీపికా దామెర్ల?**

దీపికా దామెర్ల సికింద్రాబాద్‌లో జన్మించారు. తర్వాత ఆమె కుటుంబం కెనడాకు వలస వెళ్లింది. టొరంటో యూనివర్సిటీలో రోట్‌మన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి ఆమె ఎంబీఏ ఫైనాన్స్ పూర్తి చేశారు. ఎంబీఏ పూర్తి చేసిన తర్వాత కార్పొరేట్ బ్యాంకింగ్ రంగంలో కొంతకాలం పనిచేశారు. మిసిసాగాలోనే ఓ వ్యాపారం కూడా నడిపారు. తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2018లో మిసిసాగా సిటీ కౌన్సిల్‌కు ఎన్నిక య్యారు. సిటీలోని ఏడో వార్డుకు ప్రాతినిధ్యం వహించారు. ఆ నగరంలో ఆమె దీర్ఘకాలంగా కమ్యూనిటీ లీడర్‌గానూ వ్యవహ రించారు. అంతకుముందు ప్రావిన్షియల్ పార్లమెంట్ మెంబర్‌గా మిసిసాగా ఈస్ట్ కుక్స్‌విల్లేకు ఏడేళ్లు ప్రాతినిధ్యం వహించా రు. ఆ సమయంలో ఒంటారియో వైద్య శాఖలో సహాయ మంత్రిగా పనిచేశారు. అలాగే మినిస్టర్ ఆఫ్ సీనియర్స్ అఫైర్స్‌లోనూ సేవలందించారు. వైద్యశాఖలో పనిచేస్తున్న సమయంలో మిసిసాగా ఆసుపత్రిలో 350 కొత్త బెడ్లు, రెండు లాంగ్ టర్మ్ కేర్ హోంలు, రెండు కొత్త స్కూళ్లను ఏర్పాటు చేయించారు.

## నాట్స్ తెలుగు సంబరాలు







**చార్లెట్:** అమెరికాలో తెలుగు వారిని ఐక్యం చేసేం దుకు ఉత్తర అమెరికా తెలుగుసంఘం నాట్స్ చార్లెట్‌లో సంబరాలు నిర్వహించింది. తెలుగు వారి ఐకమత్యా నికి, తెలుగు సాంస్కృతిక వైభవానికి ఈ సంబరాలు ప్రతీకగా నిలిచాయి. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన భిన్న వైరుధ్యాలు ఉన్న వారు మన తెలుగు వారి సంబరాలు అన్న మమకారంతో ఒక ఇంటి పండుగ లాగా ఈ సంబరాలు జరుపుకున్నారు. తెలుగు సంఘాల మధ్య ఉన్న సఖ్యత, సమైక్యత ఈ సంబ రాల్లో కనిపించింది. తానా జీటీఈ, ఏపీటీఈ వంటి ప్రముఖ తెలుగు సంస్థల నాయకులు ఒకే వేదికపైకి వచ్చి ఈ వేడుకలను విజయవంతం చేశా రు. తెలుగు వారిని కలిపే ఏ సంబరానికైనా నేను ముందుంటానని నాట్స్ అధ్యక్షుడు రాజ్ అల్లాడ తెలిపారు. ఆయన ఈ వేడుకల్లో సతీసమేతంగా వచ్చి అందరితోనూ మమేకమవడం నాట్స్ చార్లెట్ విభా గానికి మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. ఒక ఈ సంబరాల్లో చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ తమ ప్రదర్శనలతో కట్టిపడేశారు. శాస్త్రీయ సంగీతం, క్లాసికల్ డ్యాన్స్, ఫ్రీస్టైల్ నృత్యాలు కేవలం ప్రదర్శనలే కాకుండా మన సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించే వారధులుగా నిలిచాయి. ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సైన్స్ ఫెస్ట్" చిన్నారులలో నూతన ఉత్సాహాన్ని నింపింది. డ్రై ఐస్, ప్లాస్మా బాల్ వంటి 9 రకాల ప్రయోగాలను ఆనం దంగా తిలకించారు. చదువుతో పాటు వినోదాన్ని పంచుతూ సాగిన ఈ ప్రయోగాలు సరికొత్త ఆలోచన లను రేకెత్తించాయి. ఈ సంబరాల్లో పాల్గొనేందుకు 800 మంది రిజిస్ట్రేషన్ చేసు కోవడం విశేషం. తెలుగు సంస్కృతి, సాంప్రదా యాలు, కళలు, కళలు, విజ్ఞానం కలగలసిన నాట్స్ చార్లెట్ సంబరాలు



చార్లెట్‌లో నివసించే తెలుగువారి గుండెల్లో చిరకాలం నిలిచిపోయే మధుర జ్ఞాపకంగా నిలిచాయి. చార్లెట్‌లో అంత గొప్పగా సంబరాలు నిర్వహించిన నాట్స్ చార్లెట్ విభాగం నాయకులు దీపికతో పాటు మిగిలిన నాయకులను నాట్స్ చార్లెట్ అడ్వైజరీ సభ్యులు మూర్తి గురు విందల, నేషనల్ కోఆర్డినేటర్ వెంకట్ దగ్గుపాటి, పాస్ట్ చైర్మన్ మధు కొర్రపాటి అభినందిం చారు. జోనల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ పొనకాల, ఇండియా లైజన్ అరుణ్ రామినేని, చాప్టర్ కోఆర్డినేటర్ దీపిక సయ్యపరాజు, జాయింట్ కోఆర్డినేటర్ పల్లవి అప్పని, ఈవెంట్స్ వినీల దొప్పలపూడి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ ప్రవీణ పాకలపాటి, ట్రెజరర్ లక్ష్మి బిజ్జల, స్పోర్ట్స్ సిద్ధార్థ్ వాగంటి, సోషల్ మీడియా సుమ జుజ్జూరు, కో చైర్ రూప మద్రి అధ్వర్యంలో సంబరాలు విజయవంతంగా నిర్వహించడంపై నాట్స్ చైర్మన్ కిషోర్ కంచర్ల ప్రత్యేకంగా అభినందించారు.

# అగ్రనేతల అరెస్టులతో అట్టుడికిన ఢిల్లీ

## పోలీసుల అదుపులోకి మమత, కేజ్రీవాల్ సహా వందలాది మంది జాతీయ నేతలు





ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న నిరసనలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనకు మద్దతుగా వెళ్లిన పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను, కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలోని సౌత్ అవెన్యూ ప్రాంతంలో మమతా బెనర్జీతో పాటు తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు ఎంపీలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని బస్సులో తరలించారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ నోటికి బ్యాండేజ్ అంటించుకుని నిరసన తెలిపారు. పోలీసులు తమను బస్సులో తరలిస్తున్న సమయంలో మమతా బెనర్జీ వీడియో సందేశం విడుదల చేశారు. ప్రభుత్వం తమతో అనుచితంగా వ్యవహరిస్తోందని ఆమె ఆరోపించారు. ప్రజల గొంతుకను బలోపేతం చేసేందుకు ఇండియా కూటమి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసం చుట్టూ ఉదయం నుంచే పోలీసులు మోహరించారు. నిరసనలో పాల్గొనేందుకు బయటకు వచ్చినప్పుడు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఇక, కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను అరెస్ట్ చేసి ఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియానికి తరలించినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా సీజేపీ నిరసనకు పిలుపునిచ్చింది. ఈ నిరసనకు పలు ప్రతిపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాయి.

ముందస్తు అనుమతి లేకుండా నగరంలోని ఆగస్ట్ క్రాంతి మైదానం, ఇతర ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలో 400 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆందోళనల్లో ప్రముఖ బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ ఖాన్ కూడా ఉన్నారు. సీజేపీ ఆందోళనకు సంఘీభావంగా ముంబైలో ఈ నిరసనలు చేపట్టారు. శుక్రవారం సామాజిక కార్యకర్త తుషార్ గాంధీ నేతృత్వంలోని 'హం భారత్ కే లోగ్' సంస్థ సభ్యులు, సీపీఐ(ఎం) కార్యకర్తలు సహా దాదాపు 200 మందిని పోలీసులు ఇదే ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు, ప్రకాశ్ అంబేడ్కర్ నేతృత్వంలోని వంచిత్ బహుజన్ అఘాడి కార్యకర్తలు కూడా సీజేపీకి మద్దతుగా దక్షిణ ముంబైలోని హుతాత్మా చౌక్ వద్ద ఆందోళన చేశారు. అనుమతి లేకుండా నిరసనలు చేపట్టిన వారందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోందని పోలీసు అధికారులు వెల్లడించారు.



# కాఫీ కేఫ్‌లో ఎంపీ రాహుల్, సీఎం విజయ్ ముచ్చట్లు

## దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన తాజా భేటీ

కాంగ్రెస్ అగ్రనేత నేత రాహుల్ గాంధీ, తమిళనాడు ముఖ్యమంత్రి సీ జోసెఫ్ విజయ్ తాజా భేటీ దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. చెన్నైలోని నీలాంకరైలో ఉన్న విజయ్ నివాసంలో సుమారు గంటపాటు ఇద్దరూ చర్చలు జరిపారు. అనంతరం సమీపంలోని ఓ కేఫ్‌కు వెళ్లి కాఫీ, తిరమిసు, కుకీలు ఆస్వాదించారు. రాజకీయ చర్చలతో ప్రారంభమైన ఈ భేటీ.. ఆత్మీయ పలకరింపులు, అభిమానులతో సెల్ఫీలతో ప్రత్యేకంగా నిలిచింది. విద్యార్థులతో సమావేశంలో పాల్గొనేందుకు శనివారం చెన్నై చేరుకున్న రాహుల్ గాంధీ.. ముందుగా ముఖ్యమంత్రి విజయ్ నివాసానికి వెళ్లారు. నీలాంకరైలోని తన ఇంటి వద్ద విజయ్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు నేతలు సుమారు గంటపాటు సమావేశమయ్యారు. ఈ భేటీలో వీరిద్దరూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్, టీవీకే మధ్య సమన్వయం, భవిష్యత్తు రాజకీయ అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఇంటి వద్ద సమావేశం ముగిసిన తర్వాత రాహుల్ గాంధీ, విజయ్ సమీపంలోని ఓ కేఫ్‌కు వెళ్లారు. కేఫ్‌లో ఈ ఇద్దరూ కాపుచినో, తిరమిసు, కుకీలు ఆర్డర్ చేసి ఆస్వాదించారు. ఇద్దరు నేతలు ఒకేచోట కనిపించడంతో కేఫ్‌లో ఉన్నవారు ఆశ్చర్యానికి గురయ్యారు. కొందరు అభిమానులు వారితో సెల్ఫీలు దిగేందుకు ప్రయత్నించారు. రాహుల్ గాంధీ, విజయ్ కూడా అక్కడి వారితో ముచ్చటించారు. సెల్ఫీలు దిగారు. సాధారణ రాజకీయ సమావేశాలకు భిన్నంగా సాగిన ఈ కేఫ్ సందర్శన.. ఇద్దరు నేతల మధ్య సాన్నిహిత్యాన్ని చాటింది.

# ఇరవై నాలుగ్గంటల్లో నేతలందరినీ విడుదల చేయాలి

## పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ అల్టిమేటం



న్యూఢిల్లీలో పోలీసులు అదుపులోకి తీసుకున్న నాయకులను, నిరసనకారులను 24 గంటల్లో విడుదల చేయాలని, లేకపోతే తాను నిరాహారదీక్ష లేదా పాదయాత్ర చేపడతానని పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ హెచ్చరించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ నిరసనకు అనుమతి లేదన్న పోలీసులు.. ఇందులో పాల్గొన్న నాయకులు, విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. ఇలా నిరసనకారులను అరెస్ట్ చేయడాన్ని వాంగ్‌చుక్ ఖండించారు. ఈ పరిస్థితి ప్రకటించని ఎమర్జెన్సీలాగా ఉందని ధ్వజమెత్తారు. ఇప్పటివరకు పలువురు నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి అరెస్ట్‌లను వాంగ్‌చుక్ తీవ్రంగా తప్పుబట్టారు. 'నిరసనకు చాలా మంది రాజకీయ నాయకులు మద్దతు ఇవ్వటం నాకు ఆనందాన్ని ఇచ్చింది. అయితే ఈ నాయకులందరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఇప్పుడే తెలిసింది. వీరందరినీ ప్రభుత్వం రేపటిలోగా విడుదల చేయాలి. లేనిపక్షంలో నేను నిరాహారదీక్ష లేదా పాదయాత్ర చేస్తాను' అని ఆయన పేర్కొన్నారు. కాగా గతంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేసిన సంగతి విదితమే.

# ఫ్లైదుబాయ్ ఉగ్రకుట్రపై ఎట్టకేలకు ఎఫ్ఐఆర్






ఫ్లైదుబాయ్ విమానంలో జరిగిన ఉగ్రకుట్రపై శనివారం జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. యాంటీ హైజాకింగ్ చట్టం 2016, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా) కింద కేసు నమోదు చేసినట్టు ఆ సంస్థ వెల్లడించింది. సెప్టెంబర్ 30న యూఏఈలోని దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్‌కు ప్రయాణిస్తున్న ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చేందుకు ఉగ్ర ప్రయత్నం జరిగిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ప్రధాన పైలట్ స్మిత్ మచ్చార్‌పై కో–పైలట్ అల్‌హమ్మామీ గొడ్డలితో దాడి చేశాడు. అయితే మచ్చార్ ప్రాణాలకు తెగించి ప్రయాణికులను రక్షించేందుకు ప్రయత్నించారు. ప్రయాణికుల్లో ఉన్న ఇద్దరు ఆఫ్ డ్యూటీ పైలట్ల సహాయంతో విమానాన్ని సురక్షితంగా సౌదీ అరేబియాలో ల్యాండ్ చేశారు. ఆ తరువాత హమ్మామీని సౌదీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కాగా ఈ ఘటనపై విచారణ జరపాలని జాతీయ దర్యాప్తు సంస్థను కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు ఎఫ్ఐఆర్‌ను ఎన్ఐఏ నమోదు చేసింది. అయితే ఈ ఎఫ్ఐఆర్‌లో ఉగ్రదాడి వెనుక కారణాలను పేర్కొనలేదు. హమ్మామీ మినహా ఇంకో వ్యక్తి పేరూ ప్రస్తావించలేదు. మరోవైపు ఫ్లైదుబాయ్ ప్రధాన పైలట్ స్మిత్ మచ్చార్ ఆరోగ్యం మెరుగవుతోందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.






# నిరాధార ఆరోపణలతో ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం

## 'సర్'కు మద్దతుగా 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల లేఖ

భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు మద్దతుగా 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు బహిరంగ లేఖను విడుదల చేశారు. ఎన్నికల్లో అక్రమాలు, ఓట్ల చోరీ జరిగాయంటూ చేసే ఆరోపణలకు విశ్వసనీయమైన ఆధారాలు ఉండాలని వారు స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలు ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయంటూ ఇండియా కూటమి నేతలు, కాక్రోచ్ జనతా పార్టీ ఆరోపిస్తున్న వేళ మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు లేఖ రాయడం సంచలనంగా మారింది. ఈ సందర్భంగా తాము ఏ రాజకీయ పార్టీకి చెందినవాళ్లం కాదని మాజీ అధికారులు లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాల రూపకల్పన, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత వంటి అంశాల్లో తమకు ప్రత్యక్ష అనుభవం ఉందని వివరించారు. గతంలో బూత్‌ల ఆక్రమణ, బ్యాలెట్ బాక్సుల చోరీ, ఓటర్లను ఓటు వేయకుండా అడ్డుకోవడం వంటి అక్రమాలు జరిగేవని గుర్తుచేశారు. ప్రస్తుతం ఎన్నికల నిర్వహణలో పలు భద్రతా చర్యలు అమలవుతున్నాయని మాజీ అధికారులు పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పోటీ చేసిన అభ్యర్థుల ఏజెంట్లు ఓట్ల లెక్కింపును పర్యవేక్షిస్తారని వివరించారు. ఈవీఎంలను అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో సీల్ చేసి, పర్యవేక్షణకు వీలుగా భద్రపరుస్తారని తెలిపారు. అలాగే, వీవీప్యాట్ స్లిప్పులను ఈవీఎంల లెక్కలతో సరిపోల్చే విధానం కూడా ఉందన్నారు. ఈ సందర్భంగా 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికలను ఉదాహరణగా పేర్కొన్నారు. ఆ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఒక్క చోట కూడా రీపోలింగ్ అవసరం లేకుండా ఎన్నికలు పూర్తయ్యాయని, 1951 తర్వాత అత్యధిక ఓటింగ్ శాతం నమోదైందని తెలిపారు. మహిళా ఓటర్లు రికార్డు స్థాయిలో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో అమలవుతున్న పర్యవేక్షణ, భద్రతా చర్యల వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు సంబంధించి కుట్ర జరిగినట్లు నిరూపించే ఆధారాలు లేవని మాజీ అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల అక్రమాలపై ఆరోపణలు చేసేవారు అందుకు తగిన ఆధారాలను ప్రజల ముందుంచాలని కోరారు. కాగా, ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనల్లో పాల్గొనేందుకు ప్రయత్నించిన పలువురు ప్రతిపక్ష నేతలను నేడు ఢిల్లీలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో నలుగురు మాజీ ముఖ్యమంత్రులు కూడా ఉన్నారు. ఇలాంటి సమయంలో మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల లేఖ చర్చనీయాంశమైంది.

# టెక్సాస్ సరిహద్దులో ట్రంప్‌నకు అడ్డు'గోడ'

## భూములివ్వబోమని తిరుగుబాటుకు దిగిన రైతాంగం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణానికి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. 46 బిలియన్ డాలర్ల భారీ బడ్జెట్‌తో పసిఫిక్ మహాసముద్రం నుంచి గల్ఫ్ ఆఫ్ మెక్సికో వరకు ఈ గోడను నిర్మించాలని ప్రభుత్వం ప్రణాళిక వేసింది. అయితే టెక్సాస్‌లోని భూస్వాములు, రైతులు తమ భూములను ఇవ్వడానికి నిరాకరిస్తూ తిరుగుబాటు చేస్తున్నారు. సరిహద్దు వెంబడి ఉన్న రాష్ట్రాల్లో టెక్సాస్ ప్రత్యేకమైనది. ఇక్కడ సరిహద్దు భూమిలో అత్యధిక భాగం ప్రభుత్వానిది కాదు, ప్రైవేట్ వ్యక్తులది. తరతరాలుగా ఆ భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్న కుటుంబాలు ఇప్పుడు గోడ కోసం తమ భూమి పోతుందనే భయంతో ఉన్నాయి. గోడ నిర్మించాలంటే ముందు ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. అందుకు భూ యజమానులు ఒప్పుకోవడం లేదు. గోడ నిర్మాణవల్ల తమ పొలాలు రెండు ముక్కలవుతాయని రైతులు చెబుతున్నారు. కొందరి భూములు గోడకు అవతలి వైపు మిగిలిపోతాయి.

దీంతో తమ సొంత పొలానికే వెళ్లడం కష్టమవుతుందని వారి ఆవేదన. నది నీటి వినియోగం, వరద నీటి ప్రవాహంపై కూడా గోడ ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. అలాగే ప్రభుత్వం ఇచ్చే పరిహారం తమ భూమి విలువకు, తమ జీవనోపాధికి సరిపోదని వారు వాదిస్తున్నారు.

రైతులు ఒప్పుకోకపోతే ప్రభుత్వం న్యాయస్థానాల ద్వారా భూమిని స్వాధీనం చేసుకునే మార్గం ఎంచుకుంటుంది. ప్రజావసరాల కోసం ప్రైవేట్ భూమిని తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. అయితే దీనికి న్యాయమైన పరిహారం చెల్లించాలి. ఇలాంటి కేసులు కోర్టుల్లో సంవత్సరాల తరబడి సాగే అవకాశం ఉంది. ఇది గోడ నిర్మాణ వేగాన్ని దెబ్బతీస్తుందని నిపుణులు భావిస్తున్నారు. సరిహద్దు భద్రతను తన ప్రధాన హామీల్లో ఒకటిగా చెప్పుకునే ట్రంప్‌కు సొంత పార్టీ మద్దతుదారులు ఎక్కువగా ఉన్న టెక్సాస్ నుంచే వ్యతిరేకత రావడం ఊహించని పరిణామం. పర్యావరణ సంస్థలు, స్థానిక సంఘాలు కూడా రైతులకు తోడయ్యాయి. వన్యప్రాణుల ఆవాసాలు, చారిత్రక ప్రదేశాలకు నష్టం కలుగుతుందని అవి చెబుతున్నాయి. ప్రభుత్వం ఈ అడ్డంకులను ఎలా అధిగమిస్తుందో, రైతులతో చర్చలు జరుపుతుందా? లేక కోర్టు మార్గాన్నే ఎంచుకుంటుందో వేచి చూడాలి. ఏదేమైనా, టెక్సాస్ రైతుల పోరాటం ట్రంప్ గోడ భవిష్యత్తును నిర్ణయించే కీలక అంశంగా మారుతోంది.

# ఇజ్రాయెలీ గాత్రంలో హనుమాన్ చాలీసా

## -పైలట్ స్మిత్ కోసం ప్రార్థించిన బెన్ రైవిట్జ్



ఫ్లైదుబాయ్ విమానంలో తీవ్ర గాయాలతోనూ విరోచితంగా పోరాడి.. ఎంతోమంది ప్రయాణికులను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యసాహసాలపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఇజ్రాయెల్‌కు చెందిన గాయకుడు బెన్ రైవిట్జ్ హనుమాన్ చాలీసా పఠిస్తూ స్మిత్ త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్గా మారింది. విపత్కర పరిస్థితుల్లో విమానాన్ని కూలకుండా నియంత్రిస్తూ.. ధైర్యం కోసం మచ్చర్ హనుమాన్ చాలీసా పఠించినట్టు తెలుసుకున్న బెన్ రైవిట్జ్ ఎంతగానో చలించిపోయారు. ఈ క్రమంలో ఆయన స్వయంగా హనుమాన్ చాలీసాను ఆలపించి, ఆ వీడియోను తన ఇన్‌స్టాలో షేర్ చేశారు. ఈ వీడియోను కెప్టెన్‌కు అంకితం చేస్తున్నట్టు తెలిపారు. స్మిత్‌ను భారత హీరోగా అభివర్ణిస్తూ, ఆయన పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బెన్ రైవిట్జ్ చేసిన ఈ ప్రయత్నానికి సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. సంగీతానికి, మానవత్వానికి దేశాల సరిహద్దులు అడ్డుకావని ఈ ఘటన మరోసారి చాటిచెబుతోందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# సూపర్‌మార్కెట్‌లో కుప్పకూలిన పైకప్పు

## 38 మందికి గాయాలు.. సౌత్‌కొరియాలో ప్రమాదం

దక్షిణకొరియాలోని ఓ షాపింగ్ మాల్‌లో పైకప్పు కూలడంతో సుమారు 38 మంది గాయపడ్డారు. ఈ ఘటన దేగూ సిటీలో జరిగింది. ప్లాస్టర్ సీలింగ్ కూలినట్టు అధికారులు చెప్పారు. ఘటనలో చిక్కుకున్న 66 మందిని సురక్షితంగా తరలించినట్టు దేగూ అగ్నిమాపక శాఖ పేర్కొన్నది. ఇవాళ ఉదయం 10.16 నిమిషాలకు ఘటన చోటుచేసుకుంది.వివిధ ఆస్పత్రుల్లో కొందరు చికిత్స పొందుతున్నారు. గాయపడ్డవారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని, కానీ తీవ్రంగా గాయపడ్డ వారు ఎవరూ లేరని అధికారులు చెప్పారు. నాలుగు అంతస్తుల బిల్డింగ్‌లో రెండో అంతస్తు పైకప్పు ప్లాస్టరింగ్ కూలిందని ఫైర్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ యూన్ జాంగ్ మి తెలిపారు. అయితే దేనివల్ల పైకప్పు కూలిందో తేల్చలేదు.ఈ ఘటనలో గాయపడ్డవారికి మెరుగైన చికిత్స అందించాలని దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మయుంగ్ తెలిపారు.



# షార్జా తీరంలో ట్యాంకర్‌పై డ్రోన్ దాడి

## 22 మంది భారతీయులు సురక్షితం

షార్జా తీరంలో లంగరు వేసి ఉన్న పనామాకు చెందిన క్రూడాయిల్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి జరిగింది. అక్టోబర్ 9న చోటుచేసుకున్న ఘటనలో నౌకలోని 22మంది భారతీయ సిబ్బంది క్షేమంగా బయటపడ్డారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. దాడికి గురైన నౌక పేరు ఎంటీ జీఈఎం నెం.2. యూఏఈలోని షార్జా తీరంలో, అరేబియన్ గల్ఫ్ ప్రాంతంలో ఈ ట్యాంకర్ ఉంది. దాడిలో ఎవరికీ ఎలాంటి హాని కలగలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. షిప్ మేనేజ్‌మెంట్ సంస్థతో సంప్రదింపులు జరుపుతున్నామని, భారతీయ సిబ్బంది భద్రత కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని సోనోవాల్ తెలిపారు. ఈ దాడిని భారత్, లైబీరియా తీవ్రంగా ఖండించాయి. వాణిజ్య నౌకలు, నావికా సిబ్బందిపై దాడులు జరగడం సరికాదని అభిప్రాయపడ్డాయి. సముద్ర రవాణా సజావుగా సాగాలన్నా, సిబ్బంది భద్రత కాపాడాలన్నా అంతర్జాతీయ స్థాయిలో సహకారం, సమన్వయం అవసరమని ఇరు దేశాలు స్పష్టం చేశాయి. ఈ అంశంపై విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ కూడా స్పందించారు. సముద్ర వాణిజ్యం నిర్వహించే దేశాలు, నౌకా రవాణా దేశాలు, నావికా సిబ్బంది ఉన్న దేశాలు కలిసి ఏర్పాటు చేసిన 'గ్రూప్ ఆఫ్ ఫ్రెండ్స్ ఆన్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఆఫ్ షిప్పింగ్ సీఫేరర్స్' (జీఓఎఫ్ ఆన్ ఎస్4) ఈ దిశగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. నౌకలు, సిబ్బంది రక్షణకు తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ బృందం తొలి సమావేశం ఇటీవల న్యూయార్క్‌లో జరగగా, 25 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు.




# రష్యా డీజిల్ కొనుగోలుకు ట్రంప్ సిద్ధం

## పుతిన్‌తో చర్చలు విజయవంతమంటూ ప్రకటన.. జెలెన్స్కీ ఆగ్రహం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలకు షాక్ ఇచ్చారు. రష్యానుంచి డీజిల్ కొనుగోలు చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. తన సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్' ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో జరిగిన చర్చలు అత్యంత విజయవంతమయ్యాయని ఆయన చెప్పారు. ట్రంప్ చెప్పిన వివరాల ప్రకారం, ముందుగా 3 లక్షల టన్నుల డీజిల్‌ను వెంటనే సరఫరా చేయడానికి పుతిన్ అంగీకరించారు. నవంబర్‌లో మరో 5 లక్షల టన్నులు, తర్వాత 10 లక్షల టన్నులు, అనంతరం 30 లక్షల టన్నులు రష్యా సరఫరా చేస్తుంది. హర్మూజ్ జలసంధిపై పూర్తి పట్టు, రష్యాతో ఇంధన ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు రికార్డు స్థాయిలో తగ్గుతాయని ఆయన అన్నారు. ఈ మార్పు చాలా వేగంగా కనిపిస్తుందని చెప్పారు. నవంబర్ 3న అమెరికాలో మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. ఈ సమయంలో ట్రంప్ అత్యవసరంగా డీజిల్ కొనుగోలుకు సిద్ధపడటం చర్చనీయాంశమైంది.

మరోవైపు, ఈ నిర్ణయం చర్చకు దారితీసింది. రష్యానుంచి ఇంధనం కొంటే భారీ సుంకాలు విధిస్తామని కొంతకాలం క్రితం ట్రంప్ భారత్‌ను హెచ్చరించారు. ఇప్పుడు ఆయనే అదే ఇంధనం కోసం రష్యాపై ఆధారపడటం అర్థం కాని విషయంగా మారింది. ఈ ప్రకటనను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తీవ్రంగా ఖండించారు. ఇది పుతిన్‌కు ట్రంప్ ఇస్తున్న బహుమతి అని ఆరోపించారు. డీజిల్ అమ్మడం వల్ల వచ్చే డబ్బుతో రష్యా యుద్ధాన్ని కొనసాగిస్తుందని, దీనివల్ల శాంతి రాదని అన్నారు. ఆ డబ్బుతో రష్యా మరింత తీవ్రంగా దాడులు చేస్తుందని జెలెన్ స్కీ ఆందోళన వ్యక్తం చేశారు.

# పనామాలో భారీ భూకంపం

## పలు భవనాలకు నష్టం, సునామీ ముప్పు తొలగింపు



పనామాను శుక్రవారం భారీ భూకంపం వణికించింది. యూఎస్‌జీఎస్ ప్రాథమికంగా దీని తీవ్రతను 7.7గా ప్రకటించింది. తర్వాత అధ్యయనంలో ఈ తీవ్రతను 7.6గా సవరించారు. భూకంపం దేశానికి దక్షిణాన, పసిఫిక్ వైపు సంభవించింది. కేంద్రం పిటలోజా అరిబాకు సుమారు 12 కిలోమీటర్ల పశ్చిమ–నైరుతి దిశలో ఉంది. భూకంపం వల్ల భవనాలు దెబ్బతిన్నాయి, పలువురు గాయపడ్డారు. ప్రజలను పెద్ద ఎత్తున ఖాళీ చేయించారు. విద్యుత్, రవాణా, ప్రజా సేవలకు అంతరాయం కలిగింది. పెనోనోమేలో శతాబ్దాల చరిత్ర ఉన్న శాన్ జువాన్ బాటిస్టా కేథడ్రల్ కూడా దెబ్బతింది. అక్కడి ప్రాంతీయ ప్రభుత్వ భవనానికి కూడా నష్టం జరిగింది. రాజధాని పనామా సిటీలో కూడా కొన్ని భవనాలు దెబ్బతిన్నాయి. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం ప్రాణనష్టం నమోదు కాలేదు. కొందరికి స్వల్ప గాయాలయ్యాయని, మరణాలు, గల్లంతైనవారి వివరాలు ఇంతవరకు లేవని అధికారులు తెలిపారు. భూకంపం తర్వాత ప్రకంపనలు కొనసాగాయి. మొత్తం 147 ఆఫ్టర్‌షాక్‌లు నమోదయ్యాయని అత్యవసర కార్యకలాపాల కేంద్రం డైరెక్టర్ రెనే గార్సియా వెల్లడించారు. వాటిలో కొన్ని 6.1, 6.6 తీవ్రతకు చేరాయి. మొదట అమెరికా సునామీ హెచ్చరిక వ్యవస్థ పలు దేశాలకు హెచ్చరికలు జారీ చేసింది. వాటిలో కోస్టారికా, ఎల్ సాల్వడార్, పెరూ, మెక్సికో, గ్వాటెమాలా, పనామా, నికరాగ్వా, కొలంబియా, ఈక్వడార్ ఉన్నాయి. అయితే పసిఫిక్ సునామీ హెచ్చరిక కేంద్రం తర్వాత ఆ ముప్పును ఉపసంహరించుకుంది. నష్టాన్ని అంచనా వేస్తున్నామని జాతీయ పౌర రక్షణ వ్యవస్థ (సినాప్రోక్) తెలిపింది. ప్రస్తుతానికి అంతర్జాతీయ సహాయం కోరే ఆలోచన లేదని, అవసరమైతే నిర్ణయం మారవచ్చని పేర్కొంది. సహాయక సిబ్బంది దెబ్బతిన్న భవనాలను పరిశీలిస్తున్నారు.

# బ్యాట్ బాదుడు! బౌలర్ బాధ!!

## కొత్త ట్రెండ్‌పై హెడ్‌కోచ్ గంభీర్ ఏమంటున్నాడంటే..



మొన్నటికి మొన్న గువాహటి వన్డేలో ఇరు జట్లూ కలిపి 811 పరుగులు.. నిన్న రాంచీ టీ20లో 501. పరుగుల వరదతో రికార్డులు బద్దలవుతున్నాయి. కానీ బ్యాటింగ్ పిచ్‌ల వల్ల క్రికెట్ కళ తప్పుతోందనే విమర్శలూ ఊపందుకుంటున్నాయి. ఇదే అంశంపై టీమ్ ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మరోసారి గళం విప్పాడు. రెండు వారాలు కూడా తిరక్కుండానే ఈ అంశాన్ని రెండోసారి లేవనెత్తాడు. ఇలాంటి పిచ్‌లపై బౌలర్ల కెరీర్లు ప్రమాదంలో పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

శుక్రవారం రాంచీ వేదికగా జరిగిన రెండో టీ20లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 249 పరుగులు చేసింది. తిలక్ వర్మ (44 నాటౌట్) చివర్లో మెరుపులు మెరిపించాడు. భారీ లక్ష్య ఛేదనలో విండీస్ తొలి ఓవర్లోనే 5 పరుగులకు 2 వికెట్లు కోల్పోయింది. ఆరో ఓవర్ ముగిసేలోపే స్కోరు 58/3. ఈ దశలో షై హోప్ జట్టును ఆదుకున్నాడు. కేవలం 45 బంతుల్లో 9 సిక్సర్లతో అజేయ శతకం (102 నాటౌట్) బాదాడు. షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (37 బంతుల్లో 84)తో కలిసి నాలుగో వికెట్‌కు 54 బంతుల్లోనే 120 పరుగులు జోడించాడు. దీంతో విండీస్ 18.3 ఓవర్లలోనే 252 పరుగులు చేసి, మరో 9 బంతులు మిగిలి ఉండగానే గెలిచింది. టీ20ల్లో విండీస్‌కు ఇదే అత్యధిక విజయవంతమైన ఛేదన. ఈ ఓటమితో భారత్ వరుస 10 విజయాల జోరుకు బ్రేక్ పడింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్ 1-1తో సమమైంది. ఫ్లాట్ పిచ్, మంచు, చిన్న మైదానం.. ఈ మూడూ తోడవ్వడంతో 38.3 ఓవర్లలోనే ఏకంగా 33 సిక్సర్లు నమోదయ్యాయి.

**'వాళ్లు మన బౌలర్లే..'**

మ్యాచ్ అనంతరం గంభీర్ మాట్లాడుతూ.. "బంతికి, బ్యాట్‌కు మధ్య సమఉజ్జీ పోటీ ఉండాలని అందరూ కోరుకుంటారు. మేమూ అదే కోరుకుంటున్నాం. వీళ్లు మన బౌలర్లు, వేరే దేశం వాళ్లు కాదు. ఇలాంటి పరిస్థితుల్లో వారి కెరీర్లే ప్రమాదంలో పడుతున్నాయి. ఈ డ్రెస్సింగ్ రూమ్‌లో చోటు సంపాదించేందుకు వాళ్లు ఎంతో శ్రమించారు. పోటీ సమంగా ఉన్నప్పుడే అత్యుత్తమ క్రికెట్‌ను చూడగలం" అని వ్యాఖ్యానించాడు. గువాహటి వన్డేలో భారత్ 406 పరుగుల లక్ష్యాన్ని ఛేదించినప్పుడు కూడా గంభీర్ ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. రికార్డులపరంగా, ప్రేక్షకులకు, బ్రాడ్‌కాస్టర్లకు ఆ మ్యాచ్ అద్భుతంగా అనిపించినా.. అది కేవలం బ్యాటింగ్ మాత్రమేనని, క్రికెట్ కాదని అప్పట్లో అన్నాడు.

**అతడే గేమ్ ఛేంజర్..**

పరుగుల వరదలోనూ పట్టు చూపిన విండీస్ బౌలర్ రోస్టన్ ఛేజ్‌పై గంభీర్ ప్రశంసలు కురిపించాడు. "ఒకే లైన్ అండ్ లెంగ్త్‌లో బంతులేస్తే బ్యాటర్లు కుదురుకుంటారు. పరిస్థితులను బట్టి వేరియేషన్లు మార్చాలి. రోస్టన్ సరిగ్గా అదే చేశాడు. మధ్య ఓవర్లలో అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శివమ్ దూబేలను ఔట్ చేయడంతో భారత్ జోరు కాస్త తగ్గింది" అని చెప్పాడు. ఇరు జట్లలో రోస్టన్ (3/24) మినహా బౌలర్లంతా ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు.

**ఎవర్నీ నిందించలేం..**

భారత్ ఓటమిపై గంభీర్ స్పందిస్తూ.. "ఇక్కడ నేను ఎవర్నీ నిందించలేను. 250 లక్ష్యం ఇచ్చినప్పుడు గెలుస్తామనే అనుకుంటాం. టాస్ మన చేతుల్లో ఉండదు. క్యాచ్‌లు జారుతుంటాయి. అయితే ఏ ఓటమినీ తేలిగ్గా తీసుకోం. మనది ప్రపంచ ఛాంపియన్ జట్టు, ఇంకా మెరుగవ్వాలి. వెస్టిండీస్‌లాంటి ప్రమాదకర జట్టుతో ఆడేటప్పుడు స్కోరును కాపాడుకునేందుకు కొత్త మార్గాలు వెతకాలని ఈ మ్యాచ్ నేర్పింది" అని వివరించాడు. సిరీస్‌లో మూడో టీ20 ఇండోర్‌లో జరగనుంది.



## మిస్టర్ 360 మళ్లీ..

దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్ మరోసారి విధ్వంసం సృష్టించాడు. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్) 2026లో ఆస్ట్రేలియా ఛాంపియన్స్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. శుక్రవారం షార్జాలో జరిగిన మ్యాచ్‌లో కెప్టెన్ ఏబీడీ కేవలం 37 బంతుల్లోనే శతకం బాదాడు. మైదానం నలువైపులా షాట్లు ఆడి 'మిస్టర్ 360' అనే పేరును మరోసారి నిరూపించుకున్నాడు. 40 బంతుల్లో 6 ఫోర్లు, 11 సిక్సర్లతో 111 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఆసీస్ నిర్దేశించిన 210 పరుగుల లక్ష్యాన్ని మంచు ముక్కలా కరిగించాడు. ఫాఫ్ డుప్లెసిస్ ఆరంభంలోనే ఔటైనా, ఏబీడీ క్రీజులోకి వచ్చాక ఆట పూర్తిగా మారిపోయింది. జేపీ డుమిని అండగా నిలవడంతో దక్షిణాఫ్రికా ఛాంపియన్స్ 15.4 ఓవర్లలోనే రెండు వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించింది. 8 వికెట్ల తేడాతో గెలిచి, 26 బంతులు ముందే ముగించింది. 16వ ఓవర్లో బెన్ హిల్ఫెనాస్ బౌలింగ్‌లో సిక్సర్‌తో శతకం పూర్తి చేశాడు. అంతకుముందు ఆసీస్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 209 పరుగులు చేసింది. తన పిల్లలు కళ్లారా తన ఆట చూడాలని కోరడంతోనే ఈ టోర్నమెంట్ ఆడుతున్నానని ఏబీడీ చెప్పాడు. 42 ఏళ్ల వయసులోనూ అతడి బ్యాటింగ్ చూస్తే ఆ మాట నిజమే అనిపిస్తుంది.

**229.11 స్ట్రయిక్ రేటుతో..**

డబ్ల్యూసీఎల్‌లో దంచేస్తున్న ఏబీడీ, రెండు మ్యాచుల్లోనే 181 పరుగులు చేశాడు. అది కూడా 229.11 స్ట్రయిక్ రేటుతో. తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్ ఛాంపియన్స్‌పై మెరిసిన అతడు, ఈ టోర్నీలో టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. గత ఏడాది ఫైనల్లోనూ పాకిస్థాన్ ఛాంపియన్స్‌పై 60 బంతుల్లో 120 నాటౌట్‌తో జట్టును తొలి డబ్ల్యూసీఎల్ టైటిల్‌కు నడిపించాడు.

ఒకప్పటిలా బెరుకు లేకుండా చెలరేగిన తీరు చూసిన అభిమానులు, మళ్లీ ఐపీఎల్ ఆడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఐపీఎల్ 2027 (20వ సీజన్) వేలంలో పేరు నమోదు చేసుకోవాలని కోరుతున్నారు. గతంలో విరాట్ కోహ్లీతో కలిసి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఆడిన డివిలియర్స్ చెరగని ముద్ర వేశాడు. 11 సీజన్లలో (2011 నుంచి 2021 వరకు) ఆర్సీబీ జెర్సీతో 156 మ్యాచుల్లో 4,491 పరుగులు చేశాడు. అందులో రెండు శతకాలు, 37 అర్ధశతకాలు ఉన్నాయి.

## రెన్‌షా రాజసం



**- డర్బన్ టెస్టులో 190..**

**- ద్విశతకం చేజారినా ఆసీస్‌కు భారీ స్కోరు**

డర్బన్ టెస్టులో ఆస్ట్రేలియా బ్యాటర్ మ్యాట్ రెన్‌షా కెరీర్‌లోనే అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడాడు. తొలి ద్విశతకానికి కేవలం 10 పరుగుల దూరంలో 190 వద్ద ఔటయ్యాడు. తొలిరోజే 84 పరుగులకు నాలుగు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన ఆసీస్‌ను.. అతడు ఒంటిచేత్తో నిలబెట్టాడు. కెప్టెన్ కమిన్స్ (43), టెయిలెండర్ల సహకారంతో జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 390 పరుగులు చేసింది. నాలుగొందలకు పది పరుగుల దూరంలో ఆగిపోయింది. టీ విరామం తర్వాత వెంటనే రెన్‌షా చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025–27 చక్రంలో భాగంగా డిఫెండింగ్ ఛాంపియన్ దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. తొలిరోజు తడబడిన ఆస్ట్రేలియా, రెండో రోజు గొప్పగా పుంజుకుంది. మూడున్నరేళ్ల తర్వాత పునరాగమనం చేసి బంగ్లాదేశ్‌పై విఫలమైన రెన్‌షా, ఈసారి సఫారీ బౌలర్లను అద్భుతంగా ఎదుర్కొన్నాడు. వియాన్ ముల్డర్ (4/68), యాన్సెన్ (3/68), నోర్జ్ బుల్లెట్ బంతులను కాచుకున్నాడు. రబాడ, ఎంగిడి లేకపోయినా సఫారీ పేస్ దళం ఆసీస్ టాప్ ఆర్డర్‌ను వణికించింది. హెడ్ (9), లబూషేన్ (37), స్మిత్ (25), క్యారీ (14) విఫలమయ్యారు.

**క్రీజులో పాతుకుపోయి**

ఓవర్‌నైట్ స్కోరు 187/6తో రెండో రోజు ఆట మొదలుపెట్టిన ఆసీస్‌ను రెన్‌షా (46 నాటౌట్) ముందుండి నడిపించాడు. కమిన్స్‌తో కలిసి ఏడో వికెట్‌కు 86 పరుగులు జోడించాడు. ఈ జోడీని ముల్డర్ విడదీశాడు. భోజన విరామానికి ముందే రెన్‌షా శతకం పూర్తి చేశాడు. దాదాపు పదేళ్ల తర్వాత అతడికి ఇది రెండో టెస్టు సెంచరీ. 2017లో పాకిస్థాన్‌పై చేసిన 184 పరుగుల తర్వాత మళ్లీ మూడంకెల స్కోరు ఇప్పుడే. 'సెంచరీ కొట్టాను కదా' అని వికెట్ ఇవ్వకుండా, కష్టాల్లో వచ్చిన ఆ వందను 150 దాటించాడు. సఫారీ బౌలర్లను విసిగించాడు. లంచ్ సమయానికి ఆసీస్ 277/8తో నిలిచింది.

ఆ తర్వాత రెన్‌షా, నాథన్ లియన్ (27) తొమ్మిదో వికెట్‌కు 134 పరుగులు జోడించారు. ఇది దక్షిణాఫ్రికాపై ఆస్ట్రేలియాకు తొమ్మిదో వికెట్ రికార్డు భాగస్వామ్యం. లియన్‌ను యాన్సెన్ బౌల్డ్ చేయడంతో బవుమా సేన ఊపిరి పీల్చుకుంది. హేజిల్‌వుడ్ అండతో జట్టు టీ సమయానికి 390/9కి చేరింది. విరామం తర్వాత వెంటనే రెన్‌షా ఆడిన బంతిని మర్‌క్రమ్ అందుకోవడంతో ఆసీస్ ఇన్నింగ్స్ ముగిసింది. 395 బంతులు ఎదుర్కొన్న రెన్‌షా ఇన్నింగ్స్‌లో 21 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. తన గత అత్యుత్తమ స్కోరు 184ను దాటాడు. దక్షిణాఫ్రికా గడ్డపై ఒక ఆసీస్ బ్యాటర్ చేసిన నాలుగో అత్యుత్తమ స్కోరు ఇదే.

## జింబాబ్వే తొలి అడుగు

**టీమిండియాతో చరిత్రాత్మక సిరీస్‌కు స్క్వాడ్ రెడీ**



వచ్చే ఏడాది పురుషుల వన్డే ప్రపంచకప్‌కు సంయుక్త ఆతిథ్య దేశంగా ఉన్న జింబాబ్వే క్రికెట్‌లో కొత్త అధ్యాయం మొదలవుతోంది. ఆ దేశ మహిళల జట్టు తొలిసారిగా భారత పర్యటనకు వస్తోంది. టీమిండియాతో వారికిదే తొలి ద్వైపాక్షిక సిరీస్. ఇటీవలే స్వదేశంలో వెస్టిండీస్‌పై చారిత్రక విజయం సాధించిన జట్టు, అదే ఉత్సాహంతో భారత్‌లో అడుగుపెట్టనుంది. ఈ పర్యటన కోసం జింబాబ్వే క్రికెట్ 15మందితో జట్టును ప్రకటించింది. జోసెఫిన్ న్కోమో కెప్టెన్‌గా వ్యవహరిస్తుంది.

**మార్పుల్లేకుండానే..**

వెస్టిండీస్‌తో సిరీస్ ఆడిన జట్టునే సెలెక్టర్లు యథాతథంగా కొనసాగించారు. సెప్టెంబరు 27న హరారేలో వెస్టిండీస్‌ను 4 వికెట్ల తేడాతో ఓడించి, ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్‌షిప్‌లో జింబాబ్వే తమ తొలి విజయాన్ని నమోదు చేసింది. ఆ మ్యాచ్‌లో న్యాషా గ్వాంజురా 33 పరుగులకు 4 వికెట్లతో కెరీర్ బెస్ట్ ప్రదర్శన చేసింది. ఆమె జట్టులో కొనసాగుతోంది. ఆరు మ్యాచ్‌ల ఈ పర్యటనలో మూడు టీ20లు, మూడు వన్డేలుంటాయి. అక్టోబరు 16న టీ20లతో సిరీస్ మొదలవుతుంది. టీ20లకు రాయ్‌పూర్, వన్డేలకు వడోదర వేదికలు. వన్డేలు ఛాంపియన్‌షిప్‌లో భాగం కాబట్టి, జింబాబ్వేకు కీలక పాయింట్లు సాధించే అవకాశం కూడా.

జింబాబ్వే జట్టు: జోసెఫిన్ న్కోమో (కెప్టెన్), బిలవ్ట్ బిజా, చిపో ముగేరి–తిరిపానో, కెలిస్ ఎన్‌ద్లోవు, మిషెల్ మవుంగా, ఫ్రాన్సిస్కా చిపారే, ఒలిండర్ చారే, కుద్జాయ్ చిగోరా, న్యాషా గ్వాంజురా, నొమ్వేలో సిబాండా, లోరిన్ ఫిరి, చియేద్జా ధురురు, మోడెస్టర్ ముపచిక్వా, టెండాయ్ మకుషా, షార్న్ మేయర్స్.

# 'రణబాలి' ట్రైలర్‌పై నారా లోకేష్ ప్రశంసలు



విజయ్ దేవరకొండ హీరోగా రానున్న చిత్రం 'రణబాలి'. తాజాగా విడుదలైన సినిమా ట్రైలర్‌పై ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. 1800ల్లో రాయలసీమ ఎదుర్కొన్న పరిస్థితులు, బ్రిటిష్ పాలకుల అణచివేత, అప్పటి దారుణమైన కరవును తెరపై ఆవిష్కరించిన తీరు అద్భుతంగా ఉందని లోకేశ్ అభినందించారు. రాయలసీమ తన సొంత ఊరు అనుకునేంత సహజమైన యాసతో విజయ్ దేవరకొండ ఆకట్టుకున్నారని కొనియాడారు. రష్మిక నటన కూడా బాగుందని మెచ్చుకున్నారు. చరిత్రలో శక్తిమంతమైన ఒక అధ్యాయానికి జీవం పోసినందుకు దర్శకుడు రాహుల్ సాంకృత్యన్‌ను అభినందించారు. ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ పోస్టుపై విజయ్ దేవరకొండ స్పందిస్తూ.. నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. "సీమ గడ్డ నాకు ఎంతో ఇచ్చింది, ఈ సినిమాతో నేనూ కొంత రుణం తీర్చుకుంటున్నా. మీ ప్రోత్సాహం మాలో ఎంతో ఉత్సాహాన్ని నింపింది. ఒక గొప్ప సినిమా మీకోసం సిద్ధంగా ఉంది. మన నేల, మన ప్రజల గొప్పతనాన్ని చాటిచెప్పే చిత్రమిది" అని విజయ్ తన పోస్టులో రాసుకొచ్చారు. 1854 నుంచి 1878 మధ్యకాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా, పాన్ ఇండియా స్థాయిలో 'రణబాలి' రూపొందింది. అక్టోబర్ 16న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.







# ఖాళీ థియేటర్లకు దసరా కళ వచ్చేనా?

గత కొన్నేళ్లుగా టాలీవుడ్‌లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు స్టార్ హీరోల సినిమాలు విడుదలవుతున్నాయంటే థియేటర్ల వద్ద సందడి కనిపించేది. కానీ ఇటీవల సరైన ఆక్యుపెన్సీలు లేక థియేటర్లు ఖాళీగా దర్శనమిస్తున్న పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీనికి సరైన కంటెంట్ లేకపోవడమా? స్టార్ హీరోల సినిమాలు ఆలస్యంగా విడుదలవుతుండటమా? కారణాలేవైనా.. టాలీవుడ్‌ను డ్రై సీజన్ వెంటాడుతూనే ఉంది. ఈ ఏడాది పరిస్థితులను పరిశీలిస్తే సంక్రాంతి సీజన్ తర్వాత బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో సందడి కనిపించలేదు. 'ధురంధర్-2', 'ఉస్తాద్' వంటి సినిమాల రాకతో మళ్లీ థియేటర్ల వద్ద కళ కనిపించిందనే అభిప్రాయం వ్యక్తమైంది. ఆ తర్వాత 'పెద్ది' విడుదల వరకు బాక్సాఫీస్ పరిస్థితి అంతంతమాత్రంగానే సాగింది. 'పెద్ది' తర్వాత పరిస్థితులు కొంత మెరుగుపడగా, 'ది ప్యారడైజ్' వరకు థియేటర్లలో ప్రేక్షకుల ఆసక్తి కొనసాగినట్లు కనిపించింది. అయితే 'ది ప్యారడైజ్' ఆశించిన స్థాయిలో సుదీర్ఘ థియేట్రికల్ రన్‌ను కొనసాగించలేకపోవడంతో మళ్లీ బాక్సాఫీస్ వద్ద సందడి తగ్గుతోందనే చర్చ మొదలైంది. ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే బలమైన సినిమాల కోసం సినీ పరిశ్రమ ఎదురుచూస్తోంది. ఈ నేపథ్యంలో దసరా కానుకగా రానున్న 'జైలర్-2', 'రణబాలి' చిత్రాలపై అందరి దృష్టి పడింది. ప్రస్తుతానికి ఈ సినిమాలపై భారీస్థాయిలో హైప్ కనిపించకపోయినా, ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే సామర్థ్యం వీటికి ఉందనే అంచనాలు ఉన్నాయి. దసరా సెలవులు కూడా ఈ చిత్రాలకు కలిసొచ్చే అవకాశం ఉంది. అయితే బాక్సాఫీస్ వద్ద ఈ సినిమాల భవిష్యత్తును నిర్ణయించేది ప్రేక్షకుల స్పందనే. మంచి టాక్ వస్తే వసూళ్లు పుంజుకునే అవకాశం ఉంది. లేదంటే టాలీవుడ్‌లో మరోసారి డ్రై సీజన్ పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. మరి దసరా సినిమాలు బాక్సాఫీస్‌కు ఎంతవరకు ఊపునిస్తాయో చూడాలి.

# నాని.. చెఫ్ టు గ్యాంగ్‌స్టర్!

నేచురల్ స్టార్ నాని వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన నటించిన తాజా చిత్రం 'ది ప్యారడైజ్' భారీ ఓపెనింగ్స్ సాధించి, కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమా తర్వాత ఎక్కువ విరామం తీసుకోకుండానే మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు నాని సిద్ధమవుతున్నారు. యువ దర్శకుడు సుజీత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' అనే యాక్షన్ చిత్రంలో ఆయన నటించనున్నారు. ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఆసక్తికరమైన అప్‌డేట్ వినిపిస్తోంది. నాని ఇకపై 'గ్యాంగ్‌స్టర్ మోడ్'లోకి వెళ్లనున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రంలో ఆయన చెఫ్‌గా కనిపించడంతోపాటు గ్యాంగ్‌స్టర్ పాత్రలోనూ అలరించనున్నట్టు సమాచారం. విభిన్నమైన పాత్రలు, యాక్షన్ అంశాలతో తెరకెక్కనున్న సినిమాపై అభిమానుల్లో ఇప్పటికే ఆసక్తి నెలకొంది. తాజా సమాచారం ప్రకారం, అక్టోబర్ 16 లేదా 17 నుంచి నాని 'బ్లడీ రోమియో' షూటింగ్‌లో పాల్గొనే అవకాశమున్నట్టు తెలుస్తోంది. అయితే షూటింగ్ ప్రారంభ తేదీపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'బ్లడీ రోమియో' చిత్రాన్ని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది. వచ్చే ఏడాది ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నట్టు సమాచారం. నాని చెఫ్‌గా, గ్యాంగ్‌స్టర్‌గా రెండు భిన్నమైన షేడ్స్‌లో కనిపించనున్నారనే వార్త సినిమాపై అంచనాలను పెంచుతోంది. షూటింగ్ ప్రారంభం, ఇతర నటీనటులు, విడుదల తేదీకి సంబంధించిన వివరాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.






# వీలైతే.. ప్రోత్సహించండి

వైఫల్యాలు ఎదురైనంత మాత్రాన కెరీర్ ముగిసిపోయినట్టు కాదన్నారు నటుడు ఆది సాయికుమార్. ప్రతి హీరోకు ఒడుదొడుకులు ఉంటాయన్నారు. తాజాగా ఓ నెటిజన్ పెట్టిన పోస్టుకు ఆయన స్పందించారు. కొందరు హీరోలకు కనీసం యూట్యూబర్లకు ఉన్న ఫాలోయింగ్ కూడా ఉండదని ఓ నెటిజన్ పోస్ట్ పెట్టారు. దానికి ఆది సాయికుమర్ ఘాటుగా రిప్లై ఇచ్చారు. "ఇండస్ట్రీలో ప్రతి హీరో ప్రయాణం వెనక ఒక కథ ఉంటుంది. వారి విజయం కోసం ఎంతో శ్రమ చేసి ఉంటారు. మా నాన్న కూడా ఎన్నో ఏళ్లు కష్టాలు పడ్డారు. రవితేజ ఎన్నో ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చారు. అన్ని కష్టాలు ఎదుర్కొన్నంత మాత్రాన వాళ్ల కెరీర్లు ముగిసిపోయినట్లు కాదు కదా.. అందరూ ఒడుదొడుకులు ఎదుర్కొంటారు. అలాంటి వాళ్లను కించపరిచే బదులు వాళ్లను ప్రోత్సహించండి. సినీ జీవితంలో జయాపజయాలు సహజం. ఇలా నెగెటివ్ పోస్ట్ల వల్లే సోషల్ మీడియా సినిమాను సెలబ్రేట్ చేసుకునే వేదికగా కాకుండా.. అభిమానుల మధ్య యుద్ధాలకు వేదికగా మారుతోంది. ప్రతి ఒక్కరినీ గౌరవించడం నేర్చుకోండి" అని ఆది సాయికుమార్ తన పోస్టులో రాసుకొచ్చారు.

# చిన్న సినిమా.. పెద్ద విజయం!

***రూ.2 కోట్ల కన్నడ సినిమా రూ.50 కోట్ల దిశగా***




కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని కన్నడ చిత్రం 'ప్రేమద ఊరాలి' మరోసారి నిరూపిస్తోంది. స్టార్ హీరోలు, భారీ ప్రచారం లేకుండా కేవలం రూ.2 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం, విడుదలైన తొలిరోజుల్లో నెమ్మదిగా సాగినా.. మౌత్ టాక్‌తో క్రమంగా వసూళ్లలో దూసుకుపోతోంది. గ్రామీణ నేపథ్యం, కుటుంబ బంధాలు, సహజమైన భావోద్వేగాలే సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు ఈ సినిమాకు అండగా నిలుస్తున్నారు. త్వరలోనే కర్ణాటకలో రూ.50 కోట్ల మార్కును అందుకుంటుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే జోరు కొనసాగితే 'టాక్సిక్' సాధించినట్లు చెబుతున్న రూ.80 కోట్ల వసూళ్లను కూడా అధిగమిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే ఈ గణాంకాలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

# 'కాకా'పై కాక పెంచిన థమన్




మెగాస్టార్ చిరంజీవి హీరోగా, బ్లాక్‌బస్టర్ దర్శకుడు కొల్లి బాబీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్ 'కాకా'. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా.. ఎప్పుడెప్పుడు విడుదలవుతుందా? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ కూడా దాదాపు పూర్తి కావడంతో సినిమా విడుదలకు సంబంధించిన అప్‌డేట్స్‌పై ఉత్కంఠ పెరుగుతోంది. ఇదిలా ఉంటే, ఈ సినిమాపై సంగీత దర్శకుడు ఎస్ఎస్ థమన్ తనదైన శైలిలో అంచనాలను మరింత పెంచుతున్నారు.

చిరంజీవితో కలిసి ఉన్న ఓ క్లిప్‌ను పంచుకుంటూ.. 'ఆల్‌టైమ్ రికార్డులు గ్యారెంటీ' అంటూ ధీమా వ్యక్తం చేశారు. థమన్ వ్యాఖ్యలతో సినిమాపై చిత్ర బృందానికి ఉన్న నమ్మకం ఏమిటో అర్థమవుతోంది. మరోవైపు, మేకర్స్ కూడా ఈ సినిమాతో బాక్సాఫీస్ వద్ద భారీ ప్రభావం చూపించాలనే ఉత్సాహంతో ఉన్నట్టు తెలుస్తోంది. చిరంజీవి ఇమేజ్‌కు తగ్గట్టుగా దర్శకుడు కొల్లి బాబీ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్టు సమాచారం. దీనికి థమన్ సంగీతం కూడా తోడవడంతో అభిమానుల్లో అంచనాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా చిరంజీవిని తెరపై కొత్తగా చూపించే అంశాలు సినిమాలో ఎలా ఉండబోతున్నాయన్న ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో యువ హీరోయిన్ అనస్వర కీలక పాత్రలో నటిస్తోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమాను జనవరి 13న గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. అయితే థమన్ చెబుతున్నట్లుగా ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిజంగానే ఆల్‌టైమ్ రికార్డులు సృష్టిస్తుందా? అన్నది సినిమా విడుదలయ్యాకే తేలనుంది.